# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



సోమవారం 06 జనవరి 2025


## అధికారులు భూ సమస్యలను నిర్లక్ష్యం చేయరాదు

### మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి

**చిన్నమండెం, జనవరి 5, ప్రభాతవార్త**



అధికారులు భూ సమస్యలను నిర్లక్ష్యం చేయ రాదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం, బోరెడ్డి గారిపల్లెలోని మంత్రి నివాసం నందు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో భూసమస్యలు ఎక్కువగా ఉన్నాయని భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని దీంతో అన్నమయ్య జిల్లాలోని ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. భూ బాధితులు ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలను మంత్రి స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండాస్ చేస్తూ ఆదేశాలు జారి చేశారు,

## వాహనం ఢీ కొని క్రిష్ణజింక మృతి

**మదనపల్లె, జనవరి 5 ప్రభాతవార్త :**



గుర్తు తెలియని వాహనం ఢీ కొని క్రిష్ణజింక మృతి చెందిన సంఘటన ములకలచెరువు మండలంలో చోటు చేసుకొంది. ఆదివారం పెద్దపాలెం సమీపంలో క్రిష్ణ జింక రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలనో క్రిష్ణ జింక తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందింది. క్రిష్ణ జింక మృతి చెందిన విషయాన్ని స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీశాఖ అధికారులు మృతి చెందిన జింక ప్రాంతాన్ని పరిశీలించి అనంతరం కనుగొండ అటవీ ప్రాంతంలో క్రిష్ణ జింకను ఖననం చేసినట్లు ఫారెస్టు సెక్షన్ అధికారి షెబీన్‌తాజ్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో కృష్ణజింకలు మృత్యువాత పడుతున్నాయి.

# దేవుడు భూములు దోపిడి

### ఫ్లాట్లు వేసి అమ్ముకున్నారు... గుండ్లూరులో రూ.3కోట్ల విలువైన భూములు కబ్జా

### ఎల్లమ్మ, లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ మాన్యాలు ఆక్రమణ... సర్వేకు పొలిటికల్ బ్రేక్

### ముడుపులతో కొందరు డ్రామా



గుండ్లూరులోని ఎల్లమ్మ ఆలయం



లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం



ఫ్లాట్లు వేసి అమ్ముకున్న భూమి ఇదే

**రాజంపేట అర్బన్, జనవరి 05, ప్రభాతవార్త:**

దేవుడి భూములు దోపిడి చేస్తున్నారు. గ్రామ దేవత మాన్యం భూములు ఆక్రమించారు. ఆక్రమణదారులకు గ్రామ దేవత అంటే భయం లేదు, దేవుడంటే భక్తి లేదనడానికి కోట్ల రూపాయల విలువైన భూములు ఆక్రమించుకోవడమే ఇందుకు కారణం. కడప–రేణిగుంట జాతీయ రహదారికి సమీపంలోనే దేవుడు మాన్యాల భూములు చెరబట్టాయి. సర్వేను పాలిట్రిక్స్ అడ్డుకుంటున్నాయి. కొందరు ముడుపులు తీసుకున్న అధికారులు అభ్యంతరం పేరుతో సర్వేలు చేయకుండా డ్రామా ఆడుతున్నారు. దేవుడు భూములనే కాపాడలేని ప్రభుత్వం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సర్వేకు వస్తున్న ప్రభుత్వ అధికారులనే అడ్డుకుంటుంటే వ్యవస్థ ఎందుకని గుండ్లూరు గ్రామస్థులు ముక్త కంఠంతో ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెలితే..రాజంపేట మండలం గుండ్లూరు రెవెన్యూ పొలంలో వివిధ దేవుళ్ల మాన్యాలకు సంబంధించి వందల ఎకరాల భూములు ఉన్నాయి. ప్రతి ఏటా దేవదాయ శాఖ వాటిని పంటల సాగుకు వేలం వేయడం ఆనవాయితీగా వస్తోంది. కౌలుకు తీసుకున్న రైతులు పంటలు సాగు చేసుకొని వేలంలో పాడిన మేరకు కిస్తు కడతారు. అయితే కొందరు కౌలుదారులు వరుసగా వేలంలో భూములు దక్కించుకొని ఏకంగా ఫ్లాట్లు వేసి అమ్మారంటే ఎంత బరి తెగించారో అర్థం చేసుకోవచ్చు. మరికొందరు తమ భూములు పక్కనే ఉన్న ఆలయ భూములను తమ భూముల్లో కలుపుకున్నారు. గుండ్లూరులోని ఎల్లమ్మ మాన్యం సర్వే నెంబర్ 151లో 79సెంట్ల విలువైన భూమి ఉంది. ఈ భూమిని కొందరు ఏకంగా ఫ్లాట్లు వేసి అమ్మేశారు. రాజకీయాలతో ఫ్లాట్లు వేసి అమ్ముతున్న పట్టించుకున్న నేతలు లేరు. లొసుగులను అడ్డుపెట్టుకొని ఏకంగా కోర్టును కూడ ఆక్రమదారులు ఆశ్రయించారు. మరోవైను లక్ష్మీ నారాయణ స్వామి ఆలయానికి సర్వే నెంబర్ 143లో 1.62ఎకరాల భూమి ఉంది. దీన్ని సుమారు సగంకు పైగా చుట్టుప్రక్కల భూములున్నవారు ఆక్రమించారు. ఆలయ భూములు పర్యరక్షించేందుకు గ్రామంలో కొందరు ప్రయత్నాలు చేస్తున్న అడ్డుతగిలే వారే ఎక్కువయ్యారు. లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించేందుకు కూడ ఓ దాత ముందుకు వచ్చిన సర్వేను అడ్డుకుంటూ కొందరు దేవుళ్లనే బెదిరించేలా వ్యవహరిస్తున్నారు. ఈ ఆక్రమణలకు సంబంధించి గత నెల 12న జరిగిన రెవెన్యూ సదస్సులో ఉమ్మడి వేణుగోపాల్ రెడ్డి అనే రైతు ఆలయ మాన్యం భూములు కూడ ఫ్లాట్లు వేసి అమ్ముకున్నారని మాన్యం భూములు పర్యరక్షించాలని దేవాలయ ఆస్తులను కాపాడాలని సర్వే చేసి అప్పగించాలని ఫిర్యాదు చేశారు. ఒక్కసారి సర్వేకు వచ్చిన కొంతమంది మిగతా ఆలయ మాన్యాల భూములు ఆక్రమణలు సర్వే చేసి మరళా తరువాత ఇక్కడికి రావాలని చెప్పారంటూ వచ్చిన దారినే వెళ్లారు. అందులో ఇద్దరు ఉద్యోగులు ఆక్రమణ దారుల నుంచి ముడుపులు తీసుకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తే అందులో కూడ పరిష్కారం కాకపోతే ప్రభుత్వ ఆశయానికి అర్థం లేదని పోలీసులను రక్షణగా పెట్టి అయినా సర్వే నిర్వహించి దేవాలయ ఆస్తులను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇకనైనా రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు తమ పనితీరు మార్చుకొని దేవుడి భూములు కాపాడేందుకు ప్రయత్నిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

### పెండింగ్‌లో ఉన్న

# పిఆర్‌సి డిఏలపై మంత్రికి వినతి



**సంబేపల్లి; జనవరి 05, ప్రభాత వార్త**

ఉపాధ్యాయులకుపెండింగ్ లో ఉన్న పి ఆర్ సి డి ఏ ల పై ప్రతినెల ఒకటో తారీఖున జీతాలు చెల్లించేలా చూడాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కి ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఆదివారం మంత్రి క్యాంప్ ఆఫీస్ లో వినతి పత్రం సమర్పించారు మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమస్యలపై పలు సమస్యలపై మంత్రిత్వ చర్చించినట్లు సంబేపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులునల్లమల్ల రామాంజనేయులు తెలిపారు మంత్రి సానుకూలంగా స్పందించారని ఈ సమస్యల ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఉపాధ్యాయ సమస్యలను తీసుకెళ్తానని వారి సమస్యలను తొందరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న కాలంలోనే ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేశారని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలియజేశారు ఉపాధ్యాయులు అంటే చంద్రబాబు నాయుడుకు ఎనలేని అభిమానం అని ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారని ఆయన తెలిపారు ఉపాధ్యాయులకు వలసిన పిఆర్సి డిఎలు తొందరగా వచ్చేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు అంతేకాకుండా ఉపాధ్యాయులు అంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి ఎంతో అభిమానం అని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సంఘం నాయకులు శివహరి రెడ్డి అప్ప రెడ్డి వాలునాయక్ పాల్గొన్నారు

## ఆకాశం భూమి పకృతిని కప్పేస్తున్న తెల్లటి మంచు

**మైదుకూరు, జనవరి 05, ప్రభాతవార్త:**

మైదుకూరు మండలంలో పట్టణ గ్రామాల ప్రజలకు ఆకాశం భూమి పకృతిని కప్పేసుకున్న తెల్లటి మంచుతో కనువిందు చేస్తున్న ఉదయాన్నే రహదారుల ప్రయాణం ఇబ్బంది కరంగా ఉంటుంది.విపరీతమైన చలి గాలులు,గాలిలో తేమశాతం ఎక్కువ ఉండడంతో అధికంగా చలి ప్రభావం ఎక్కువ ఉంది దీంతో ప్రజలు ఉదయం ప్రయాణంలో కొంతమేర తగు జాగ్రత్తలు తీసుకోవాలి.



# కోడి పందెలపై పోలీస్ డేగ కన్ను

### పందాలకు సై అంటున్న యువకులు... గ్రామాల్లో కోడిపుంజులు జోరు

**మదనపల్లె, జనవరి 5 ప్రభాతవార్త :**

సంక్రాంతి పండుగ రోజున సాంప్రదాయంగా భావించే కోడి పందాల నిర్వహణపై పోలీస్ డేగకన్ను వేసింది. కోడిపందాలు నిర్వహణ పందెందారులు రహస్యంగా కోళ్ళకు కత్తులు కట్టి పందాలు నిర్వహించనున్నారు. సంక్రాంతి పండగ వారం రోజులు ముందుగానే మదనపల్లె పరిసర ప్రాంతాల్లో కోడిపందాలను భారీగా నిర్వహించేందకు సిద్దమయ్యారు. ప్రతి ఏటా బోగి, సంక్రాంతి, కనుమ, మూడు రోజులు కోడి పందాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో పడమటి ప్రాంతాల్లో ఎక్కువుగా కోడి పందాలు జరుగుతాయి. ఇప్పటికే ఆయా నియోజకవర్గంలోని సర్కిల్‌ఇన్స్‌పెక్టర్లు కోడిపందాలను నిర్వహించరాదంటూ హెచ్చరికలు సైతం జారీ చేశారు. కోడి పందాలను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ప్రకటనలు ఇచ్చారు. ఈ కోడి పందాలు ఎక్కువుగా వందల కోట్లల్లో పందాలు కట్టి నోట్ల కట్టలు చేతులు మారుతాయి. ఎంపిలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వివిధ పార్టీ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, భూస్వాములు ఏడాదిపాటు ప్రత్యేకంగా పెంచుకొన్న కోడి పుంజులను తీసుకెళ్ళి పందెంలో పాల్గొంటారు. ఒకొక్క పుంజుపైన లక్షలు పందాలు కడుతారు. కాళ్ళకు కత్తులు కట్టి పోటీ పెడుతారు. గతంలో ఎలాంటి అనుమతి లేకుండానే అడవులు,కొండలు, గుట్టలు, చెరువుల్లో రహస్యంగా కోడిపందాలు నిర్వహించేవారు. ఒక రకంగా ఇది ఎన్నో ఏళ్లగా వస్తున్న సాంప్రదాయం ప్రకారమే ఈ పందాలు నిర్వహిస్తున్నట్లు గ్రామాల్లో పలువురు చెబుతారు. మదనపల్లె, తంబళ్ళపల్లె, పీలేరు, కురబలకోట, పెద్దమండ్యం, రాయచోటి ప్రాంతాల్లో పందెం పుంజులను ప్రత్యేకంగా పెంచుతున్నారు. ఒకొక్క పుంజుధర రూ.5వేలనుంచి 30వేల వరకు ఉంది. వీటికి ఏడాదిపాటు ప్రత్యేకంగా ఆహారం, విలువైన ధాన్యపు గింజలతో పెంచుతారు. ఎక్కడ చూసినా కోడిపుంజులను పందాలకు తీసుకెలుతూ కనిపించారు. పోలీసులకు కళ్ళుకప్పి పందాలను నిర్వహించి వేలల్లో బెట్టింగ్ వేసుకొన్నారు.



# ఇంటికో పారిశ్రామికవేత్త.. అదే ప్రభుత్వ లక్ష్యం..!

### బ్యాంకు లింకేజీ ఋణాలతో జిల్లా పొదుపు సంఘాలకు ఆర్థిక చేయూత

### వైఎస్ఆర్ జిల్లాలో వెల్లివిరుస్తున్న మహిళా సంక్షేమం

### ప్రతి గ్రామీణ మహిళా గ్లోబల్ బిజినెస్ ఉమెన్‌గా ఎదగాలి : జిల్లా కలెక్టర్

స్వయం సహాయక సంఘ మహిళల్లో ఆత్మ స్థైర్యాన్ని, ఆర్థిక భరోసాను నింపి ఆర్థిక పరిపుష్టిని సాధించడానికి ఎలాంటి పూచీకత్తు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం "బ్యాంకు లింకేజీ" రుణాలను అందిస్తోంది. ప్రతి కుటుంబం నుండి ఒక్కరైనా పారిశ్రామికవేత్తగా ఎదగాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షలకు అనుగుణంగా దిగువ, మధ్య తరగతి కుటుంబాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు బ్యాంకులతో పాటు మల్టీనేషనల్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని వ్యాపారం, స్వయం ఉపాధి రంగాలలో స్థిరపడేలా జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి నేతృత్వంలోని జిల్లా యంత్రాంగం ప్రోత్సాహాన్ని, సహాయ సహకారాలను అందిస్తోంది. అన్ని రంగాల్లో మహిళలు ముందడుగు వేసేలా డీఆర్డీఏ, మెప్మా సంస్థల ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతోంది.

"మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యం అవుతుందని నమ్మిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. అన్ని పథకాలకు మహిళలనే ప్రధాన లబ్దిదారుగా ఎంపిక చేసి మహిళలను మహిళామణులుగా నిలుపుతున్నాయి. ఇరవై దశాబ్దాల క్రితం చిరు దివ్వెగా మహిళల జీవితాల్లోకి వచ్చిన "వెలుగు" పథకం మహిళా పొదుపు సంఘాలను బలోపేతం చేస్తూ అంచెలంచెలుగా ఎదిగి గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో తిరుగులేని మహిళా శక్తిగా వారి కుటుంబాల్లోనే కాకుండా సమాజానికి కూడా వెలుగును నింపుతోంది. మహిళల ఆర్థిక అభివృద్ధితోనే సమాజ అభివృద్ధి సాధ్యం అవుతుందని నమ్మిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలన్న ఆకాంక్షను.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆశయ సాధన దిశగా ఆచరణలోకి అడుగులేస్తున్నారు. అందుకు అనుగుణంగా మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు బ్యాంకు లింకేజీ కార్యక్రమం ద్వారా అపారమైన ఆర్థిక చేయూతను అందించేందుకు జిల్లా కలెక్టర్ చేపడుతున్న చర్యలపై జిల్లాలోని స్వయం సహాయక సంఘాల అక్కచెల్లెమ్మలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

### బ్యాంకు లింకేజీ ద్వారా సాయం

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో బ్యాంకింగ్ రంగం కూడా మహిళా సంఘాల ఆర్థిక ప్రగతికి తమవంతు తోడ్పాటునిస్తోంది. జిల్లాలో గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన అభివృద్ధిలో భాగంగా.. గ్రామీణ ప్రాంతంలో 2,79,477 మంది మహిళలు కలిసి 27,574 స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి గ్రామీణ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ.. మహిళా సాధికారతను కూడా సాధిస్తున్నారు. కాగా బ్యాంకు లింకేజీ రుణాల మంజూరుపై 14.11.2024న డిఆర్డీఏ అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ జిల్లాకు లక్ష్యాన్ని నిర్దేశించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు జిల్లాలో 18,335 పొదుపు సంఘాలకు రూ.858.22 కోట్ల మేరా రుణాలను అందజేయాల్సి ఉండగా సెప్టెంబర్ 2024 మాసాంతానికి 6,447 సంఘాలకు గాను రూ.546.46 కోట్లను పంపిణీ చేసి 63.67 లక్ష్యాన్ని సాధించడం జరిగింది. మిగిలిన 11,908 స్వయం సహాయక సంఘాలలో ప్రతి సంఘానికి సీనియారిటీ, అర్హత ఆధారంగా జిల్లా కలెక్టర్ 2024, 25 ఆర్థిక సంవత్సరానికి గాను ఒక్కో సంఘానికి రూ.20 లక్షలు, రూ.15 లక్షలు, రూ. 10 లక్షలు చొప్పున మూడు రకాల ఫ్లాగ్ షిప్ కార్యక్రమ లక్ష్యాలను నిర్దేశించించారు. బ్యాంకు లింకేజీ కార్యక్రమం ద్వారా.. ఆర్థిక అర్హతలను బట్టీ మండలానికి 58 ఎస్ హెచ్ జీల చొప్పున జిల్లా వ్యాప్తంగా 2000 పొదుపు సంఘాలకు ఒక్కొక్క సంఘానికి రూ.20 లక్షలు, పైగా రుణం అందించాలని లక్ష్యంగా నిర్దేశించడం జరిగింది. అలాగే మండలానికి 86 ఎస్ హెచ్ జీల చొప్పున జిల్లా వ్యాప్తంగా 3000 సంఘాలకు ఒక్కొక్క సంఘానికి రూ.15 లక్షల నుండి 20 లక్షల మేరా రుణాలు అందించాలని నిర్ణయించింది. అంతేకాకుండా ఒక్కో సంఘానికి రూ.10 లక్షల నుండి రూ.15 లక్షల చొప్పున మండలానికి 142 సంఘాల చొప్పున జిల్లా వ్యాప్తంగా 5000 సంఘాలకు రుణాల మంజూరు లక్ష్యంగా నిర్ణయించడమైనది.

### ఉమెన్ లెడ్

ఎంఎస్ఎంఈ క్రింద "ఉమెన్ లెడ్ ఎంటర్ప్రైస్" రుణాలను స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు జిల్లాలో 100 మంజూరు చేయడం జరిగింది. మొత్తం 10 వేల మంది సంఘాల సభ్యులకు లక్ష రూపాయల నుండి 20 లక్షల వరకు వివిధ స్థాయిల్లో రుణాలను అందివ్వడం జరిగింది. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా అడుగులేస్తున్న మహిళలు పలు ప్రభుత్వ పథకాల ద్వారా బ్యాంకుల నుండి ఆర్థిక సాయం అందుకుని తమ జీవితాల్లో వెలుగులను నింపుకుంటున్నారు. ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని తమ స్వయం ఉపాధి యూనిట్లు, వ్యాపార నిర్వహణలో పెట్టుబడిగా పెట్టి సత్ఫాలితాలను సాధిస్తున్నారు. బ్యాంకు లింకేజీ, ఎమ్ఎస్ఎమ్ఈ ఫైనాన్సింగ్ సిస్టమ్ ద్వారా అందిన ఆర్థిక సాయాన్ని నిరుపయోగం కాకుండా సద్వినియోగం చేసుకుంటూ పొదుపు సంఘాల మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులేస్తున్నారు. అంతేకాకుండా తమపై అపారమైన నమ్మకంతో బ్యాంకు లింకేజీ రుణాలను అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్న జిల్లా కలెక్టర్‌కు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలుపుకుంటున్నారు.

"ప్రజాస్వామ్య పాలనలో ప్రజల సంక్షేమ బాధ్యత ప్రభుత్వాలదే.. అని నమ్మిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ప్రేమానురాగాలను సొంతం చేసుకుంటున్నారు. అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పూచీకత్తు లేని "బ్యాంకు లింకేజీ" రుణాలను జిల్లాలో విరివిగా అందిస్తున్న జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లాలోని పొదుపు సంఘాల మహిళల ఆదరాభిమానాలను చూరగొంటున్నారు. ఆయన ప్రోత్సాహం జిల్లా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వారిలో స్వాభిమానాన్ని కూడా పెంచుతున్నారు.

### గ్రామీణ మహిళలు గ్లోబల్ బిజినెస్ ఉమెన్‌గా ఎదగాలి



పలు సంక్షేమ పథకాల ద్వారా పొదుపు సంఘాల మహిళల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంచి వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనేదే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశ్యం. ప్రతి మండలం నుండి చురుకుగా ఉన్న స్వయం సహాయక గ్రూపులను గుర్తించి వారిని ఈ కామర్స్ బిజినెస్ లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహిస్తున్నాం. అంతేకాకుండా వారికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు సరైన శిక్షణను ఇస్తున్నాం. జిల్లా నుండి అత్యంత నాణ్యతా ప్రమాణాలను కలిగిన వందలాది రకాల ఉత్పత్తులను రూపొందించేలా మహిళల్లో నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నాం. బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలను అందిస్తున్నాం. స్వయం సహాయక సంఘాల మహిళలను కూడా ఈ కామర్స్ బిజినెస్ భాగస్వాములుగా అభివృద్ధి చేసి గ్రామీణ మహిళను గ్లోబల్ బిజినెస్ ఉమెన్‌గా ప్రోత్సాహం కల్పిస్తున్నాం. అందుకోసం డీఆర్డీఏ, మెప్మా శాఖల ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. ప్రభుత్వం, బ్యాంకర్లు అందిస్తున్న ఆర్థిక సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని మహిళలు సాధికారత దిశగా అడుగులేయాలి.

**డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా కలెక్టర్, వైఎస్ఆర్ జిల్లా.**



### సీఎం సేవలు వెలకట్టలేనివి

పేద మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలు.. ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఇదివరకే.. మా ఇంటి వద్ద కిరాణా కొట్టును నిర్వహిస్తున్న నాకు.. బ్యాంకు లింకేజీ ఋణం ఎంతో సాయ పడింది. మా సంఘానికి బ్యాంకు ద్వారా రూ.8,00,000 రుణం అందగా నా వంతు వాటాగా రూ.80,000 పొందాను. ఆ మొత్తాన్ని వ్యాపార విస్తరణకు పెట్టుబడిగా పెట్టాను. వ్యాపారం ఆశాజనకంగానే నడుస్తోంది. మా మహిళా గ్రూపులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవు. సకాలంలో తిరిగి రుణ చెల్లింపులు కూడా చేస్తున్నాను.

- పి.మాధవి, మైథిలీ ఎస్.హెచ్.జి.,
నెమళ్ల దిన్నె, పెద్దముడియం మండలం.

### బిజినెస్ ఉమెన్ అని గర్వాంగా చెప్పుకుంటున్నా

ఒక బిజినెస్ ఉమెన్ గా చాలా గర్వపడుతున్నాను. బ్యాంకు లింకేజీ ఋణాలు పొందేందుకు మా గ్రూపుకు అన్ని విధాలా అర్హతలు ఉండడంతో.. మెప్మా సంస్థ వారి ప్రోత్సాహంతో ఎప్పటినుండో బిజినెస్ చేయాలనే అభిలాష నెరవేరింది. రూ. 2,00,000 ల ఋణం మంజూరవడంతో.. 6 నెలల క్రితం మిల్లెట్ ఫుడ్స్ వ్యాపారాన్ని ప్రారంభించాను. వ్యాపారం బాగా జరుగుతోంది. బిజినెస్‌లో బాగా అనుభవం వచ్చింది. జిల్లా యంత్రాంగం అందించిన ప్రోత్సాహంతోనే బిజినెస్ ఉమెన్‌గా గుర్తింపు పొందాను. భవిష్యత్తులో నా వ్యాపారాన్ని మరింత విస్తృతం చేయాలనుకుంటున్నా. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వారు కూడా మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా.

- సి. భావన, వెంకటేశ్వర ఎస్.హెచ్.జి., రాజీవ్ మార్గ్, కడప సిటీ.



# వేలాదిగా తరలి వచ్చిన నిరుద్యోగులు

**పులివెందుల, జనవరి 5, ప్రభాతవార్త :**
పులివెందులలో నిర్వహించిన జాబ్ మేళాకు వేలాదిమంది నిరుద్యోగులు తరలివచ్చారు. జాబ్ మేళాకు 2352 మంది నిరుద్యోగులు హాజరవ్వగా10 40 మంది ఎంపిక అయ్యారు. పులివెందుల లోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల యందు ఆదివారం సిడప్ ,స్కిల్ ఏపీ ఆధ్వర్యంలో 26 కంపెనీలతో మెగాజాబ్ మేళా ను నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు రాయలసీమ జిల్లాల నుండి పెద్ద ఎత్తున నిరుద్యోగులు తరలివచ్చారు. తరలివచ్చిన వేలాదిమంది నిరుద్యోగులతో సభా ప్రాంగణం కిటికిటలాడింది. ఈ జాబ్ మేళాను పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ప్రారంభించారు.తరలి వచ్చిన నిరుద్యోగులకు ఏపీ స్కిల్ ఉద్యోగ సిబ్బంది రిజిస్ట్రేషన్ ఇంటర్వ్యూ కి సూచనలు ఇచ్చారు. త్రిబుల్ ఐటీ విద్యార్థులు కూడా నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు వెళ్లడానికి రిజిస్ట్రేషన్ చేయించడానికి సహాయం చేశారు. జాబ్ మేళాకు వచ్చినా నిరుద్యోగులకు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు కూడా ఎమ్మెల్సీ భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకు ఈ జాబ్ మేళా కొనసాగింది. ఉన్నత పాఠశాల ప్రాంగణమంతా నిరుద్యోగులు వారి తల్లిదండ్రులతో కిటికీటలాడింది.

**గ్రామీణ నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనకే జాబ్ మేళా**

గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్దేశంతోనే జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం హాజరైన నిరుద్యోగులను ద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ అనేకమంది యువతి యువకులు ఏ విధంగా ఉద్యోగాలు సంపాదించాలని అవగాహన లేక ఇండ్ల వద్దనే ఉండడం జరుగుతుందని వీరందరికీ జాబ్ మేళ ఒక ఫ్లాట్ ఫామ్ అని గ్రామీణ నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించాలన్న లక్ష్యంతో దాదాపు 26 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరిగిందన్నారు. పులివెందుల నియోజకవర్గమే కాకుండా రాయలసీమ మొత్తంలో భారీగా జాబు మేళకు నిరుద్యోగ యువతులు హాజరయ్యారని ఇంటర్మీడియట్ ,ఐటిఐ నుంచి ఎంటెక్ వరకు వారి అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుందన్నారు, జాబ్ మేళలో కొంతమందికి ఉద్యోగాలు రావచ్చు మరి కొద్ది మందికి రాకపోవచ్చు అని కానీ ఎవరూ కూడా నిరుస్తాహపడవద్దని మళ్లీ రెండు నెలల్లో ఇంకా మంచి కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు, నిరుద్యోగ యువతీ యువకులు తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు, ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని ఆ మేరకే సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్ వారి సూచనల సలహాలతో ఈ మెగా జాబ్ మేళా నిర్వహించడం జరిగింది అని తెలిపారు. కావున అందరూ ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలన్నారు.



**నియామక పత్రాలు అందించిన ఎమ్మెల్సీ**

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ మెగా జాబ్ మేళాకు మొత్తం 2352 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు అయ్యారు. వివిధ కంపెనీలకు చెందిన హెచ్ఆర్ లు 1040 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన ఉద్యోగులకు ఎమ్మెల్సి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ అధికారులు, 26 కంపెనీల హెచ్ఆర్ లు , నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## అలుపెరగని సేవా తపస్వి



**కాశినాయన, జనవరి 5 , ప్రభాతవార్త**
పోరుమామిళ్లలోని రామచంద్రయ్య క్లబ్‌లో ఆదివారం బొల్లు సిద్దయ్య సంస్మరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు హాజరై సిద్దయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ సంపూర్ణ జీవితానికి దగ్గరగా బ్రతికి సమాజ సేవలో నిరంతరం శ్రమించి ఎంతోమంది పలుచోట్ల ఉపాధ్యాయులుగా ఉత్తమ విలువలతో విద్యను అందించి పసి హృదయాలపై చెరగని ముద్ర వేసి గౌరవాన్ని పొందినటువంటి నిగర్వి అన్నారు.ఎందరో విద్యార్థులకు ఆదర్శవంతుడు విలువలకు కట్టుబడిన నిజాయితీపరుడు చిరు దీపాలను విద్యతో వెలిగించి సమాజానికి క్రాంతి దర్శిలా గ్రామ విద్యార్థులను ప్రోత్సహించి అందరినీ చదువు వైపు మరలించి విద్యతో వారి ప్రగతినే మార్చేసిన ఉత్తమ ఉపాధ్యాయులకు నిదర్శనమని ఆయన సేవలను కొనియాడారు ఆయన మరణం మనకు తీరని లోటు అని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రిటైర్డ్ వెంకటసుబయ్య, గురుమూర్తి, టీ. సుబ్బారావు, వెంకటేశ్వర్లు, మూర్తయ్య, విజయసుబ్బారెడ్డి,పెన్షన్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలకొలను నారాయణరెడ్డి, షేక్ దస్తగిరి సాహెబ్ బొల్లు రామామెహన్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నాగారాపమ్మ తల్లికి ఘనంగా పూజలు



**సుండుపల్లె,జనవరి05,ప్రభాతవార్త:**
మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామపంచాయతీ బండకాడ ఈడిగ పల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మ తల్లి సంతానం లేని వారికి సంతానం ప్రసాదించి, భక్తుల కోరికలు తీర్చే బంగారు కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచినది. ఆదివారం ఉదయాన్నే పూజారులు అమ్మవారిని పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## ఉపాధ్యాయులే పిల్లలకు మార్గదర్శకులు



**సుండుపల్లి, జనవరి05,ప్రభాతవార్త:**
ఉపాధ్యాయులు పిల్లల నైపుణ్య వికాసానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జెసి ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు ఆదివారం ఎఫ్ఎల్ఎన్ లో భాగంగా రాయచోటి అర్చన కళాశాలలో రూమ్ నెంబర్ 1 తరపున వేసిన సమగ్ర అభివృద్ధికి నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించి వేసిన ముగ్గుకు ఎంఈఓ రవీంద్రనాయక్కు ప్రత్యేకంగా అభినందిస్తూ బహుమతి ప్రధానం చేశారు. పిల్లలు మార్గదర్శకులుగా ఎదగడానికి నైపుణ్యాలు భాష అభివృద్ధికి సామాజిక మరియు భావోద్వేగా అభివృద్ధికి మేధా వివృద్ధికి ముగ్గుల ద్వారా సరళతర బోధన అందించడం మార్గదర్శకంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగాజాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి హరిత సుండుపల్లి ఎంఈఓ రవీంద్ర నాయకులు పాల్గొన్నారు

## మాస్టర్స్ బ్యాట్మెంటన్ జిల్లా డబుల్ విన్నర్‌గా మఠం వాసి



**బ్రహ్మంగారిమఠం జనవరి 05 ప్రభాతవార్త:**
కడప నగరంలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియం నందు ఆదివారం నాడు 35 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులను మొదలుకొని ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక విభాగము చొప్పున 65 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులకు బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలో బ్రహ్మంగారిమఠం వాసి కొత్తూరు గ్రామానికి చెందిన సూర్య ధన్య మోహన్ అలాగే కడప వాసి లోకేష్ జిల్లా లెవెల్ 35 ప్లస్ డబుల్ విన్నర్‌గా ఎంపిక అయినట్లు టోర్నమెంట్ రెఫ్రీ జిలాని భాషా తెలిపారు. ట్రోఫీని సర్టిఫికెట్లను అధికారుల చేత అందజేశారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు ఫిబ్రవరి సెకండ్ వీక్ నందు విజయవాడలో పోటీ నిర్వహిస్తారు. సూర్య ధన్య మోహన్ కు బ్యాట్మెన్ లో విన్నర్ రావడంతో బ్రహ్మంగారిమఠం వాసులు స్నేహితులు, బంధువులు అతన్ని అభినందించారు.

## రాళ్లు, కర్రలతో దాడి

**బ్రహ్మంగారిమటం , జనవరి 5, ప్రభాతవార్త :**
మండలంలోని ఎన్. గొల్లపల్లె గ్రామంలో తోడికోడళ్ల ఇంటి ముందు శుభ్రం చేసుకునే విషయమై మాటా మాటా పెరిగి వారి భర్తలైన చంద్రబాబునాయుడు, రమణయ్యనాయుడు ఇరువర్గాల మనుషులు రాళ్ల మరియు కర్రలతో దాడిచేసుకోగా తలలు, పలుచోట్ల దెబ్బలు తగిలినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించి ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని, మరళా గొడవలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.



## 50 మంది యువత బీజేపీలో చేరిక



**కలికిరి, జనవరి 5, ప్రభాతవార్త:**
కలికిరి మండలం కలికిరి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వాయల్పాడు మండలం వాయల్పాడు టౌన్‌కు చెందిన విష్ణు చైతన్య ఆధ్వర్యంలో 50 మంది యువత బీజేపీలో ఆదివారం చేరారు. మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో విష్ణు చైతన్య, యశ్వంత్ భరత్, ప్రణీత్ ఉదయ్ కుమార్, వి.కుమార్, వినాయక, నరసింహులు, గౌతం, భూపతి, నరేంద్ర, మమకార్, రమేష్, శివప్రసాద్, పద్మనాభ, రాజా రమేష్ తదితర 50 మంది యువత చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఆనంద్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి



**పెండ్లిమర్రి, జనవరి 5, ప్రభాతవార్త:**
మండలంలోని పగడాలపల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య గొర్రెల మందపై వీధి కుక్కలు ఆదివారం ఉదయం దాడి చేసి 15 గొర్రె పిల్లలను చంపేశాయి. దీంతో దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లిందని గొర్రెల కాపరి చంద్రయ్య వాపోయారు. ఎండా, వానను సైతం లెక్క చేయకుండా గొర్రెలను కాసి పెంచుకుంటున్న గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతి చెందడంతో విలపించారు.

## పంజం, ధ్వజారెడ్డిలకు సన్మాన కార్యక్రమం



**రైల్వే కోడూరు జనవరి 5 ప్రభాత వార్త**
రైల్వే కోడూరు మండలానికి చెందిన వైసిపి నాయకులు జిల్లా అధికార ప్రతినిధి గా బాధ్యతలు చేపట్టిన పంజం సుకుమారెడ్డి స్థానిక పట్టణంలోని వైసీపీ నాయకులు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంజం సుకుమార్ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంలో స్థానిక వైసీపీ నాయకులు ఘనంగా శాలువాలతో గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సిహెచ్ రమేష్ దొంతి రెడ్డి రాజారెడ్డి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

**కాశినాయన, జనవరి 5 ప్రభాత వార్త**
కడప జిల్లా, పోరమామిళ్ల మండలం, దమ్మనపల్లె గ్రామ నివాసి తోట రామాంజనేయులు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతో పురుగుల మందు తాగడంతో కడప రిమ్స్ కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోవడం జరిగినది. ఆయన టమోటా, వరి పంటలలో 13 లక్షల రూపాయల అప్పులు కావడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడనీ, కావున ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని, కుటుంబ సభ్యులు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

## క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించిన కుప్పాల

**సిద్దవటం, జనవరి 5, ప్రభాతవార్త:**
సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామ పంచాయతీ పార్వతీపురం గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని గత 2 సంవత్సరాలుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది సీజన్ 3 క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలను ఉమ్మడి కడప జిల్లా జనసేన పార్టీ నాయకులు అతికారి కృష్ణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ పంచాయతీ రాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ మానసిక ఉల్లాసం, శరీర దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని అందుకే కూటమి ప్రభుత్వం సంక్రాంతి సంబరాల్లో భాగంగా పార్వతీపురం గ్రామ సమీపంలోని క్రీడా మైదానంలో సీజన్ 3 క్రికెట్ పోటీలను ఉమ్మడి కడప జిల్లా జనసేన నాయకులు అతికారి కృష్ణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. 39 జట్లు పేర్లను నమోదు చేసుకున్నాయని మొదటి రోజు సీతాపురం, సంటిగారిపల్లె టీంలు మ్యాచ్ జరిగింది. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలన్నారు. మొదటి విజేతకు అతికారి కృష్ణ రూ.60116, 2వ బహుమతి ఏపీ పంచాయతీ రాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకట సుబ్బయ్య రూ.40116, తృతీయ బహుమతి టీడీపీ పార్లమెంట్ వాణిజ్య అధికార ప్రతినిధి చలపాటి చంద్ర (ఎన్ఆర్ఐ) రూ.20116 అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కాడే చెంచయ్య నాయుడు, టీడీపీ అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు, మన ఊరి కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్, అవ్వారు రవిశంకర్, పోటీల నిర్వాహకులు పేరూరు కొండ, సోమేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**దువ్వూరు, జనవరి 05, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కడప-కర్నూల్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంతెన విజయేంద్ర వర్మ(29) గాయ పడి చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన విజయేంద్ర వర్మ శనివారం తిరుపతి నుండి హైదరాబాద్‌కు మోటార్ సైకిల్‌పై బలుదేరాడు. మోటార్ సైకిల్ శనివారం మధ్యాహ్నం కడప-కర్నూల్ జాతీయ రహదారిపై టంగుటూరు మెట్ట సమీపంలో గేదెలను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడ్డాడు. దీంతో విజయేంద్ర వర్మకు గాయాలు కాగా వెంటనే 108 వాహణంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కొరకు తరలిస్తుండగా అక్కడ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. అన్న బాపిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## 6మంది జూదరులు అరెస్ట్

**దువ్వూరు, జనవరి 05, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరుకు సమీపంలో జూదం ఆడుతున్న 6మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 12వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు దువ్వూరు గ్రామ సమీప పొలాల్లో జూదం ఆడుతుండగా దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో వారిని అరెస్ట్ చేసి 12వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని త్వరలో మైదుకూరు కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

## నేడు మండల సమావేశం

**దువ్వూరు, జనవరి 05, ప్రభాతవార్త:**
స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవన్‌లో సోమవారం మధ్యాహ్నం 3గంటలకు మండల సర్వసభ్య సమావేశంను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ అంశాలు, అభివృద్ధి పై చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

## తప్పుడు ఆరోపణలు మానుకో..



**చాపాడు, జనవరి 05, ప్రభాతవార్త:**
తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల గురించి మాట్లాడిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాటలకు ప్రజలు నవ్వుకుంటున్నారని టిడిపి అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వస్తే కుటుంబంలో బడికి వెళ్లే పిల్లలందరికి 15వేలు ఇస్తామని, రైతుభరోసా, కేంద్రం ప్రభుత్వంతో సంబంధం లేకుండా 12వేలు ఇస్తామని కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతోనే సరిచేసి రైతులను మోసం చేయలేదా అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తుందని తెలిపారు. సలహాలు ఇవ్వాలే కానీ తప్పుడు ఆరోపణలు మానుకోవాలని ఆయన ఒక ప్రకటనలో హితవు పలికారు.

ఈనెల 10 న శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ దేవత జాతర వేలం పాట..
లక్కిరెడ్డిపల్లె; జనవరి05, ప్రభాత వార్త
మండలంలోని అనంతపురం గ్రామంలో వెలిసిన శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ దేవత దేవస్థానం నందు ఫిబ్రవరి 28 నుండి మార్చి 2 వరకు జరగబోవు గంగమ్మ జాతరకు సంబంధించి తలనీలాలు, కొబ్బరికాయలు, టోల్గేట్ లు, ప్రతి ఆదివారం ఏడాది పాటు ఆలయం ముందు కొబ్బరికాయలు, పూలదండలకు సంబంధించిన వేలం పాటను భక్తులు,గ్రామస్తుల సమక్షంలో యి నెల 10 న బహిరంగ వేలం పాట ను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కరపత్రాల ద్వారా తెలిపారు. ఈ వేలం పాట స్థానిక గంగమ్మ దేవత దేవస్థానం నందు నిర్వహిస్తామని వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ .50 వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనవలెనని కరపత్రంలో తెలిపారు.వేలం పాట ముగిసిన వెంటనే దక్కించుకున్న తర్వాత సగం డబ్బులు వెంటనే చెల్లించవలెననీ, మిగిలిన డబ్బులు పది రోజుల్లోపు చెల్లించాలని వేలంపాట కరపత్రం లో పేర్కొన్నారు. వేలం పాట దక్కని వారికి తిరిగి రూ.50 వేలు వెనక్కి ఇవ్వబడునని ఆలయ అధికారులు కరపత్రం లో పేర్కొన్నారు. భక్తులు హిందూ సాంప్రదాయ పద్ధతుల్లో వేలంపాట నిర్వహిస్తామని, హిందూ భక్తులు పాల్గొనాలని తెలిపారు. ఈ వేలంపాట కార్యక్రమంలో ధర్మాదాయ దేవాదాయ శాఖ సిబ్బంది సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున వేలంపాటలో పాల్గొన్న దలుచుకున్న వారు జనవరి 10న ఉదయం 10 గంటల లోపు గంగమ్మ దేవత ఆలయ ప్రాంగణంలో చేరుకోవాలని తెలిపారు.

## 19న గిరిజన ఆదివాసి సమ్మేళన సభ



**పీలేరు, జనవరి 05 ప్రభాతవార్త ః**
ఈనెల 19వ తేదీన గిరిజన ఆదివాసి సమ్మేళన సభ విజయవాడ వేదికగా నిర్వహిస్తున్నట్లు గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తెలిపారు. శనివారం విజయవాడ గాంధీ నగర్ నందు ప్రెస్ క్లబ్లో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా గోడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జనవరి 19వ తేదీ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే గిరిజన ఆదివాసి సమ్మేళన సభ జయప్రదం చేయాలని ఆయన గిరిజనులకు పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, జాతీయ ఎస్టి కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్, ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు, కేరళ ఐజి లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్ మరియు ప్రముఖ నేతలు హాజరవుతున్నారన్నారు. అదేవిధంగా గిరిజన సంస్కృతి సంప్రదాయాలతో గిరిజన కళాబృందం చే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. గిరిజన ప్రజల జీవన ప్రమాణం స్థాయిని పెంచే లక్ష్యంతో గిరిజనుల ఆత్మగౌరావానికై జరిగే గిరిజన ఆదివాసి సమ్మేళన సభకు వేలాదిగా గిరిజన ఆదివాసిలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. పీలేరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైదా నాయక్, రాయలసీమ జిల్లాల ఇన్చార్జి రవీంద్ర నాయక్, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు శివ నాయక్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు హనుమంతు నాయక్, రంగారావు, ఇస్లావత్ హనుమంతు నాయక్, భాస్కర్ నాయక్ తదితరులు జిపిఎస్ వివిధ జిల్లాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అమరవీరులకు ఉపాధ్యాయులు ఘన నివాళి

**వాల్మీకిపురం, జనవరి 05 ప్రభాతవార్త ః**
కాకినాడలో నిర్వహిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవాల మహా కార్యక్రమానికి వాల్మీకిపురం మండలంకు చెందిన ఉపాధ్యాయులు, యూటీఎఫ్ సంఘం నాయకులు తరలి వెళ్లారు ఆదివారం కాకినాడలో ఏర్పాటు చేసిన యూటీఎఫ్ అమరవీరుల స్థూపం వద్ద ఉపాధ్యాయులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అమరవీరులు అందించిన త్యాగాలను వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకిపురం మండల యూటీఎఫ్ నాయకులు సురేష్, నాగరాజ, వెంకట్నారాయణ, బాలాజీ, హరి, మల్లికార్జున, తదితర యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



## పిహెచ్‌డి ఉన్నంత మాత్రాన అదనపు అడ్వాన్స్ ఇంక్రిమెంట్లు కుదరదు

(ఐకార్ సాంకేతిక సిబ్బంది కేసులో సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టీకరణ)

**బద్వేలు లీగల్, జనవరి 05 ప్రభాతవార్త :**
కేవలం పిహెచ్‌డి డిగ్రీ పొందిన అర్హతతోనే భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్)లో సాంకేతిక సిబ్బంది రెండు ముందస్తు ఇంక్రిమెంట్లకు అర్హులు కాజాలరని ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది. వివరాలలోకి వెళితే... సాధారణంగా ఐకార్ శాస్త్రవేత్తలకు తాము సర్వీసులో వున్న కాలంలో పిహెచ్‌డి పట్టా ఎప్పుడు పొందితే అప్పుడు రెండు ముందస్తు ఇంక్రిమెంట్లకు అర్హత వుంటుందని, అయితే ఆ సంస్థ సాంకేతిక సిబ్బందికి కూడా ఈ నిబంధనను వర్తింప చేస్తూ క్యాట్ ఆదేశాలు జారీ చేయడంతో ఈ అంశంపై ఐకార్ సంస్థ సుప్రీం కోర్టులో అప్పీలు చేసింది. ఐకార్ అప్పీలును అనుమతించిన సుప్రీం కోర్టు క్యాట్ ఆదేశాలను కొట్టివేస్తూ తీర్పును వెలువరించింది. పిహెచ్‌డి డిగ్రీ పొందినంత మాత్రాన ఐకార్ సాంకేతిక సిబ్బందికి రెండు అడ్వాన్సు ఇంక్రిమెంట్లు అర్హత ఉండబోదని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. ఏ సంస్థలో అయినా ఒక ప్రత్యేక కేటగిరీకి చెందిన ఉద్యోగులు ఉన్నత విద్యార్హతలు పొందినపుడు అలాంటి వారి ఉద్యోగ అవసరాల ప్రాతిపదికన ప్రోత్సాహకాలు ఇవ్వడం సహజమేనని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఐకార్ సాంకేతిక విభాగంలో పనిచేసే ఓ వ్యక్తి పిహెచ్‌డి డిగ్రీ పొంది తనకు కూడా రెండు అడ్వాన్సు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరుతూ తొలుత సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఆ కేసులో సాంకేతిక సిబ్బందికి అనుకూలంగా క్యాట్ తీర్పు ఇచ్చింది. కేసు హైకోర్టుకు చేరినపుడు హైకోర్టు కూడా ట్రిబ్యునల్ ఆదేశాలను సమర్థించింది. అనంతరం క్యాట్ ఉత్తర్వులను సమర్థిస్తూ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను ఐకార్ సుప్రీం కోర్టులో అప్పీలు చేయగా విచారణ జరిపిన సుప్రీం కోర్టు ధర్మాసనం ట్రిబ్యునల్ ఆదేశాలతో పాటు హైకోర్టు తీర్పును కూడా కొట్టివేస్తూ ఐకార్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ కేసులో శాస్త్రవేత్తలను, సాంకేతిక సిబ్బందిని ఒకే కోణంలో చూస్తూ క్యాట్ హైకోర్టు పొరబాటు చేసినట్లు సుప్రీం కోర్టు వ్యాఖ్యానిస్తూ సాంకేతిక సిబ్బందికి వేరుగా నియమ నిబంధనలు ఉంటాయని, వారి నియామక నిబంధనలు కూడా విభిన్నమని ధర్మాసనం గుర్తు చేస్తూ శాస్త్రవేత్తల విధి నిర్వహణతో పోలిస్తే సాంకేతిక సిబ్బంది విధి నిర్వహణ కూడా వేరుగా వుంటుందని తెలుపుతూ వ్యవసాయ రంగానికి సంబంధించిన మౌళిక పరిశోధనల్లో, విద్యా రంగంలో శాస్త్రవేత్తలు పని చేస్తారని, అదే సాంకేతిక సిబ్బంది అయితే శాస్త్రవేత్తలకు వివిధ అంశాలలో సహకారం అందిస్తారని ధర్మాసనం పేర్కొనింది. సైంటిస్టులకు వర్తింపచేసిన స్టడీ లీవ్‌ను సాంకేతిక సిబ్బందికి కూడా వర్తింప చేసినంత మాత్రాన శాస్త్రవేత్తలకు వర్తించే ఇతర ప్రయోజనాలను తమకూ కల్పించాలంటూ సాంకేతిక సిబ్బంది కోరజాలరని పేర్కొంది. పిహెచ్‌డి డిగ్రీ పొందడానికి సాంకేతిక సిబ్బందికి స్టడీ లీవ్ మంజూరు చేయడం వారి అర్హతలను మరింత మెరుగుపరుచుకోవడానికి మాత్రమేనని సుప్రీం కోర్టు సుస్పష్టం చేసింది. భారత రాజ్యాంగంలోని 14వ అధికరణ వర్తింపునకు సంబంధించిన అంశమేదీ ఈ వ్యాజ్యములో లేదని సుప్రీం కోర్టు ధర్మాసనం సుస్పష్టంగా విశదీకరిస్తూ ఈ తీర్పును వెలువరించింది. (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఎదిరి రాజీందర్ సింగ్ మరియు ఇతరులు సివిల్ అప్పీల్ నెం.97-98/2012)

## నేటి పెన్షన్లు తనిఖీ

**పీలేరు,జనవరి 05 ప్రభాతవార్తః**
మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ లతీఫ్‌ఖాన్ తెలిపారు. ఆదివారం ఆయన ఈసందర్భంగా మాట్లాడుతూ వందశాతం అంగవైకల్యం కలిగి రూ.15వేలు పెన్షన్ పొందుతున్న లబ్దిదారులు మండలంలో 76 మంది ఉన్నారని ,ఇవి పున:పరిశీలనకు కడప వైద్య బందం డాక్టర్ ఆనంద్,మనోహర్‌లు మూడు రోజులు పాటుమండలంలో వారి ఇంటి వద్దకు వెళ్లి విచారించనున్నట్లు ఆయన తెలిపారు. లబ్దిదారులు కూడా వారికి సహకరించాలని కోరారు.

## పార్టీ బలోపేతానికి కృషి



**పీలేరు,జనవరి 05 ప్రభాతవార్తః**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీలో నూతనంగా పదవులు పొందిన వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జి. జయరామచంద్రయ్య, అన్నమయ్య జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సెక్రటరీ క్రియాశీలక కార్యదర్శిగా ఆనంద్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శిగా నారే వెంకటరమణారెడ్డి లు నియామకం కావడంతో వీరి ముగ్గురిని దుశ్శాలువలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూపార్టీ పూర్వ వైభవానికి తమ వంతు కృషిచేయాన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి ఎప్పుడు తగిన గుర్తింపు ఉంటుందని ప్రతి కార్యకర్త వైసీపీ బలోపేతానికి కృషిచేయాన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచి డాక్టర్ హబీబ్‌బాషా, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, వైసీపీనాయకులు చక్రధర్, కాలనీచిన్న, ఉదయ్‌కుమార్, విక్టరీ వెంకటరమణారెడ్డి, మల్లి, ఆనందరెడ్డి, మోహన్, దావూద్, షాకీర్, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి,తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## 70 మందికి నిత్యవసర సరుకులు పంపిణీ



**ప్రొద్దుటూరు జనవరి 5 ప్రభాతవార్త**
మండల సీనియర్ వైసిపి నాయకులు స్వర్గీయ బండి విజయభాస్కర్ రెడ్డి జ్ఞాపకార్థం పెద్ద శెట్టిపల్లె గ్రామంలో 70 మందికి నిత్యవసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. పెద్ద శెట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కొద్దిగా బండి విజయభాస్కర్ రెడ్డి ఎంతో ప్రజాభిమానం పొందిన నాయకులు గా నిలిచారు. అలాంటి వ్యక్తి జ్ఞాపకార్థం ఆయన కుమారులు బండి కుమారస్వామి రెడ్డి బండి సానా రెడ్డి బండి బాలసుబ్బారెడ్డిలు గ్రామంలో నిరుపేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక బండి విజయభాస్కర్ రెడ్డి ఎంతో ఉన్నత విలువలు గల వ్యక్తిగా తమ మనసుల్లో నిలిచిపోయారని వారు కొనియాడారు.

## యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా



**సిద్దవటం, జనవరి 5, ప్రభాతవార్త:**
సిద్దవటం మండలంలోని టక్కోలు, దేగనవాండ్లపల్లె, మాచుపల్లె, మరికొన్ని గ్రామాల్లో కొన్ని నెలల నుంచి ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. ఉచిత ఇసుక అంటూ కొందరు ట్రాక్టర్ల యజమానులు చెలరేగిపోయి పగలు, రాత్రి తోడేస్తున్నారు. పెన్నాలో సుమారు 5 అడుగుల లోతు వరకు కూలీలతో తవ్వకాలు జరిపించి ఇసుకను కడప నగరానికి తరలిస్తున్నారు. ఇదంతా యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ రవాణాపై చర్యలు తీసుకొని పెన్నాలో ఇసుక తవ్వకాలను అరికట్టాలని కోరుతున్నారు. మండల ఎస్సై బదిలీ అయ్యి నెల కావస్తున్నా ఆయన స్థానంలో ఎవరిని నియమించకపోవడంతో ఇసుక అక్రమ దారులు రెచ్చిపోతున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అధికారులు చొరవ తీసుకొని ఇసుక అక్రమ రవాణా కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉపాధ్యాయులకు 40 రోజుల ఉచిత ఆన్లైన్ ఆంగ్ల భాష బోధన తరగతులు




రాయచోటి జనవరి 5 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీదర్, డీఈవో సుబ్రహ్మణ్యం సహకారంతో విల్ టు కెన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా ఉపాధ్యాయులకు 40 రోజుల ఉచిత ఆన్లైన్ శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుంది. ఈ ప్రోగ్రాంలో భాగంగా ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాల ఆడిటోరియం, రాయచోటిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాదాపు 2000 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం సందర్భంగా నిర్వాహకులు, ట్రైనర్ రామేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఈ తరగతుల యొక్క ముఖ్య ఉద్దేశం గవర్నమెంట్ పాఠశాలలలో చదివే ప్రతి విద్యార్థి కూడా తెలుగు మాట్లాడినట్టుగా ఇంగ్లీష్ మాట్లాడేటట్టు చేయటమన్నారు. ఉపాధ్యాయులు ఎంతో శ్రద్ధగా తరగతులకు హాజరు కావడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. విల్ టు కెన్ సంస్థ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఇప్పటివరకు తెలంగాణలో 33 జిల్లాలలో 53 వేల ఉపాధ్యాయులకు ఈ తరగతులను పూర్తి చేశామని, అదేవిధంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని గవర్నమెంట్ స్కూల్లో చదివే ప్రతి విద్యార్థి కూడా తెలుగు మాట్లాడినట్టుగా ఇంగ్లీష్ మాట్లాడేటట్టు చేయటమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని, ఇందులో భాగంగానే మొదటగా విశాఖపట్నం మరియు అన్నమయ్య జిల్లాలోని జిల్లా విద్యాశాఖ సహకారంతో ఈ కార్యక్రమం అమలు చేయడం జరిగింది అని ఆయన తెలిపారు. దాదాపుగా 800 మంది ఉపాధ్యాయులు ప్రతి రోజూ ఆన్లైన్ క్లాసెస్ హాజరు అవుతున్నారన్నారు. అలాగే ప్రభుత్వ సహకారంతో మిగతా జిల్లాల ప్రభుత్వ ఉపాధ్యాయులకు కూడా ఈ శిక్షణ అందిస్తామన్నారు. ఈ అవకాశం ఇచ్చిన జిల్లా కలెక్టర్ కి, డీఈవో ఏ ఎంవోకుకీ రామేశ్వర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంఒ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయులకు రామేశ్వర్ గౌడ్ కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమం అనంతరం శ్రీ రామేశ్వర గౌడ్‌ని ఉపాధ్యాయులందరు సత్కరించడం జరిగింది.

# అభివృద్ధిస్ఫూర్తి ప్రదాత కే.కే రెడ్డి : ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ 10 లక్షల సామాగ్రి వితరణ.. తెలుగుదనం ఉట్టిపడేలా జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు



రాజంపేట, జనవరి,5, ప్రభాత వార్త

జన్మనిచ్చిన సొంతూరి రుణం తీర్చుకునేందుకు అభివృద్ధికి స్ఫూర్తి ప్రదాత ఎన్నారై కే.కే రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని రాజంపేట ఎమ్మెల్యే అకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డిలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పెద్ద కారం పల్లి పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి మన్నూరు రామలక్ష్మమ్మ, మన్నూరు నారాయణరెడ్డి చారిటబుల్ ఫౌండేషన్ ద్వారాఆయనవిద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయం చేయడం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకమన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు పెద్దపీట వేశారనిఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి గుర్తు చేశారు. ఉద్యోగరీత్యా కే.కే రెడ్డి అమెరికాలో స్థిరపడినప్పటికీ జన్మనిచ్చిన సొంతూరు రుణం తీర్చుకునేందుకు పెద్ద కారంపల్లికి వచ్చిన ప్రతిసారి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ.. నిరుపేద కుటుంబాలలో వెలుగులు నింపుతున్నారన్నారు. ముఖ్యంగా నేటి యువత వారు సంపాదించే దానిలో కొంచమైనా సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వీరబల్లి ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి, యువ నాయకులు మదన్ రెడ్డి మాట్లాడుతూ కేకే రెడ్డి రాజంపేట మండల కేంద్రంలోని పెద్దకారం పల్లెల్లో పుట్టడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. తమ ట్రస్టు ద్వారా గత కొన్ని సంవత్సరాలు నుండి ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు వెలకట్టలేని వన్నారు. రాజంపేట నియోజకవర్గంలో ఆధ్యాత్మిక భక్తి భావనను పెంపొందించేలా ఆలయాలు నిర్మించడం, పేద విద్యార్థులకు నిరంతర సేవా కార్యక్రమాలు కొనసాగించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే కే.కే రెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం తన చదివిన పాఠశాలలనుసందర్శించి ఉపాధ్యాయులతో పాఠశాల అభివృద్ధిపై చర్చించానన్నారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ ఎస్.ఎస్ .రాజు పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్నప్రధాన సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి జిల్లా పరిషత్ స్కూల్ లో విద్యార్దులకు అవసరం అయ్యే మైక్ సెట్,కంప్యూటర్,స్టేజ్ నిర్మాణం కొరకు విరాళంగా హెడ్మాస్టర్, ఉపాధ్యాయ బృందానికి విద్యార్థుల సమక్షంలోరూ.10. లక్షలు అందజేశానన్నారు. ప్రైవేట్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందిస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పేద ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. విద్యార్థులు తమ పాఠశాలకు ఎన్నారై కే.కే రెడ్డి అందించిన దాతృత్వాన్ని వారుపాటలు, మాటల్లో వివరించారు. పాఠశాల అభివృద్ధికి అడిగిన వెంటనే కాదనకుండా దాతృత్వాన్ని చూపినందుకు పాఠశాల యాజమాన్యం అయినను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిని కూడా శాలవాతో సత్కరించారు. చివరగా కే.కే రెడ్డి స్వగృహం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ముందస్తుగా గొబ్బెమ్మను కొలువు తీర్చి పూజలు చేసి జానపద గేయాలతో సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు మన్నూరు సుబ్బారెడ్డి, మన్నూరు నారాయణరెడ్డి, శుభోధ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, బాలాజీ, శివరామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళన జయప్రదం చేయండి



యర్రగుంట్ల జనవరి 5 ప్రభాతవార్త

అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలము ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు రెండు ఎకరాల సాగు భూమి మంజూరు చేయాలని జనవరి 2 నుండి సిపిఐ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఈనెల 10న మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరుగు ఆందోళనకు వ్యక్తిగత అర్జీలతో రావాలని ఆదివారం స్థానిక కడప తిప్పలూరు లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యం.వి సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఆర్జీదారుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇండ్లు ఇస్తాం, ఇంటి స్థలం ఇస్తాం, రేషన్ కార్డుతో పాటు మోలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, 24 గంటలు త్రాగునీరు అందిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలతో ఓట్లు దండుకొని అధికారంలోకి రాగానే ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి ప్రజలు ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు నెడుతున్నారని వారు ఆరోపించారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలం సాగుభూమి సాధనకై పదిన జరిగే తాసిల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# హిందు ఆలయాలకు స్వయం ప్రతిపాదినివ్వాలి



యర్రగుంట్ల జనవరి 5 ప్రభాతవార్త

దేశవ్యాప్తంగా ఉన్న హిందూ ఆలయాలకు అన్నిటికి స్వయం ప్రతిపత్తి ఇవ్వాలన్న డిమాండ్‌తో విశ్వహిందూ పరిషత్ విజయవాడలో హైందవ శంఖారావాన్ని పూరించింది. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభకూ మండలం నుంచి 3000 మంది పైగా చేరుకున్నారు. విజయవాడ, కేసరపల్లి వద్ద సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణం వసతి ఏర్పాట్లు చేశారు. సుమారు 4 లక్షల మందికిపైగా సభలో పాల్గనేలా కరపత్రాలు ఆహ్వానాలు అందజేశారు. ప్రత్యేక బస్సులు, రైళ్లలో భారీగా ఈ బహిరంగసభలో పాల్గొనేందుకు విజయవాడకు జనాలు తరలి వెళ్లారు. హిందువులంతా ఏకమై దేవాలయాల పరిరక్షణకు కదలిరావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. హైందవ శంఖారావం సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ పలు ప్రాంతాల్లో,జిల్లాలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, భారీ బైక్ ర్యాలీలు, నిర్వహించిన సంగతి తెలిసిందే. హైందవ శంఖారావంలో పాల్గొనేందుకు కేవలం ఒక్క జిల్లా నుండి దాదాపు 15వందల మంది ప్రత్యేక రైలులో చేరుకున్నట్లు తెలుస్తోంది. వివిధ మండలాల నుంచీ ప్రత్యేక బస్సులలో నేరుగా సభా స్థలి వద్దకే లక్షలాది మంది చేరుకున్నారు.

# రెవెన్యూ సదస్సుల అర్జీలపై సమీక్ష

## ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు పరిష్కార చర్యలు



పీలేరు,జనవరి 05 ప్రభాతవార్తః

ప్రజల భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటికి పరిష్కార చర్యలు చేపట్టాలని భావించింది. ఈక్రమంలో నెల రోజులుగా గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ఇక్కడ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటిని రిజిస్ట్రేషన్ చేశారు. రెవెన్యూ అధికారులు ఈఅర్జీలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా అడుగులేస్తున్నారు. ఈక్రమంలో పీలేరు మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సమస్యలు వారిగా విభజించి సమీక్ష నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఈకార్యక్రమం సోమవారం మండల కేంద్రం తహశీల్దారు కార్యాలయంలో చేపట్టనున్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అధికంగా మ్యూటేషన్ ( పేరుమార్పు), సబ్ డివిజన్ భాగ పరిష్కారాలు, ఆన్‌లైన్‌లో ఒకరిపేరుపై ఉండటం, భూమి ఒకరి అనుభవంలో ఉండటంపై అర్జీలు వచ్చాయి. రెవెన్యూ అధికారులు వీటిని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించనున్నారు. ప్రజలు సమస్యలకు కార్యాలయాల చుట్టూ తిరిగి కాలయాపన కాకుండా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈసదస్సుల తేదీని పొడిగించింది.

### - విచారణకు అర్జీలు:

రెవెన్యూ సదస్సుల్లో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టనున్నారు. వారి నుంచి స్టేట్‌మెంటు రికార్డు చేసి తమ పరిధిలోఉన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోనున్నారు. తమ పరిధిలో లేని అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో లాగిన్‌లకు పంపి అక్కడ నుంచి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోనున్నారు. కోర్టు వివాదంలో ఉన్న భూములు, భాగ పరిష్కారంలో వారసుల మధ్య ఏకాభిప్రాయం కుదరని భూముల విషయంలో అక్కడికక్కడే ఒక అవగాహనకు వచ్చి పరిష్కార దిశగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

### - ప్రతి అర్జీని విచారిస్తాం:

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులో వచ్చినప్రతి అర్జీని విచారిస్తాం.వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను వర్గీకరణ చేసి సిబ్బందిచే క్షేత్రస్థాయిలో పర్యటించి విచారణ చేపట్టి వివరాలు నమోదు చేయిస్తాం, తదుపరి పరిష్కార చర్యలు తీసుకుంటాం.

- భీమేశ్వరరావు, తహశీల్దారు, పీలేరు.

# వినియోగంలోకి చెత్త సంపద కేంద్రాలు

## - పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరేలా చర్యలు

పీలేరు, జనవరి 05 ప్రభాతవార్తః

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రపంచ ఆరోగ్య సమస్య చెబుతూ వస్తుంది. ఇందుకు అనుగుణంగా ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారంవ్యర్థాలు పడేయకుండా ఒకచోట వేయడానికి ప్రభుత్వం సంకల్పించింది. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో చెత్త సంపద కేంద్రాలను సష్టించి పంచాయతీకి ఒకటి చొప్పున ఇది ఏర్పాటుచేశారు. వీటి కోసం గ్రీన్ అంబాసిడర్‌లను సైతం ప్రభుత్వం నియమించి చెత్తసేకరణ కార్యక్రమం చేపట్టింది. ఇందుకోసం మేజర్ పంచాయతీలో రూ.12లక్షలు, చిన్న పంచాయతీలకు రూ.7లక్షలు నిధులతో వీటి నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చింది. 2019 అనంతరం అధికారం చేపట్టిన వైఎస్సార్ పార్టీ వీటి నిర్వహణ గాలికి వదిలివేసింది. ఫలితంగా 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే చెత్త సంపద కేంద్రాలకు పూర్వ వైభవం సంచరించనుంది. ఈకేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడానికి కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఈక్రమంలోనే మూలన పడ్డ ఈకేంద్రాలను వినియోగంలోకి తేవడానికి పంచాయతీ అధికారులకు ప్రభుత్వం మార్గ దర్శకాలు జారీచేసింది. ఈక్రమంలోనే వీటిని వినియోగం లోకి తేవడానికి అధికారులు సమాయాత్తమైయ్యారు.

### -అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా చెత్తసంపద కేంద్రం:

ఈచెత్తసంపద కేంద్రాలు వైఎస్సార్ పార్టీ హయాంలో వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే వీటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి కసరత్తు చేశారు. అనుకున్న విధంగానే చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి సంపద సష్టికి శ్రీకారం చుట్టింది.

### -అదనపు ఆదాయం:

చెత్తసంపద కేంద్రాల ద్వారా తడిపొడి చెత్తను వేరుచేసి వీటి ద్వారా ఎరువులను తయారుచేయడానికి శ్రీకారం చుట్టింది. ఇలా తయారైన ఎరువులను అమ్మకాలు చేపట్టాలని ప్రభుత్వం భావించింది.ఈఎరువుల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివద్దికి కేటాయించాలని ప్రభుత్వం భావించింది. ఇదే జరిగితే పంచాయతీకి ప్రభుత్వం ద్వారా వచ్చే అభివద్ది నిధులతో పాటు అదనంగా ఆదాయం సమకూరి సర్వతో ముఖాభివద్దికి అవకాశం ఉంటుంది.



# ఆత్మీయ సమావేశం అద్భుతం



రైల్వే కోడూరు జనవరి 5 ప్రభాతవార్త:

రైల్వే కోడూరు పట్టణంలోని విక్టరీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డిలు విక్టరీ పాఠశాల అధినేతలు నరసింహారెడ్డి రామకృష్ణారెడ్డిలు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్య మిత్రుల ఆత్మీయ సమావేశంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పోటీ ప్రపంచంలో మిత్రుల సమావేశం జరుపుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. టిడిపి నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మార్గదర్శకులుగా పనిచేస్తున్న యాజమాన్యం విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడంలో వీరి పాత్ర ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య, సిల్వర్ బిల్స్ అధినేత ఎం వి కుమార్, శిరిడి సాయి కళాశాల రత్నం, ధరణి పాఠశాల అధినేత ప్రసాద్, ఇలియాజ్ భాష, గురుదేవ వశిష్ట అధినేత నారాయణ వర్మ , ఆదర్శ పాఠశాల అధినేత కంచిరాజు చెంగల్ రాజు తోపాటు విక్టరీ పాఠశాల చెందిన విద్యార్థులు ముందస్తు భోగి పండుగను నిర్వహించారు.

# ఘనంగా అనంతపురం గంగమ్మకు పూజలు

లక్కిరెడ్డిపల్లి : జనవరి 05, ప్రభాతవార్త

మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలసి యున్న గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు అన్ని ఏర్పాట్లు చేశారు అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు పూజ కార్యక్రమాలు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో క్యు లైన్లన్నీ కిక్కిరిసి పోయాయి ఆలయ ప్రాంగణమంతా భక్తులు కిక్కిరిసింది చెల్లు వంశీయులు భక్తులకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వచ్చిన భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసులు ఆలయ సిబ్బంది మధుసూదన్ రెడ్డి, నాగేశ్వరమ్మ, మార్కండేయ, భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మైలవరం కెనాల్‌పై ఆక్రమణలు తొలగించండి



ప్రొద్దుటూరు జనవరి 5 ప్రభాతవార్త

మండలం గోపవరం పంచాయతీ పరిధిలోని కాల్వకట్ట వీధిలో మైలవరం కెనాలపై ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి ఆక్రమణల దారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆ ప్రాంత వాసులు తనకి టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు నేరుగా కలిసి తొలగించేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వరద మైలవరం కెనాల్ పై ఆక్రమణలు తొలగించి కాలువ మారమ్మత్తులను చేయాలని పనులు ప్రారంభించినందున త్వరలోనే వాటిని తొలగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, కేసి కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ద్వార్సల గురివిరెడ్డి తదితరులు ఉన్నారు.

# సగర సంఘం 2025 క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రొద్దుటూరు, జనవరి 5, ప్రభాతవార్త

కడప జిల్లా సగర సంఘం రూపొందించిన 2025 క్యాలెండర్ ను ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షులు మజ్జారి వీర మోహన్ ఆధ్వర్యంలో స్థానిక మైదుకూరు రోడ్డు లోని మండి మార్కెట్ సమీపంలోని సాయి రైస్ మిల్ లోని ఆయన కార్యాలయంలో తనతో పాటు సగర సంఘం సభ్యుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రొద్దుటూరు ప్రజలకు, సగర కుల బాంధవులకు ఆయన ఈ సందర్భంగా ముందస్తు మకర సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా సగర సంఘం ప్రధాన కార్యదర్శి లాయర్ చంద్ర, కోశాధికారి జోడు శివప్రసాద్, సభ్యులు పల్లవోలు రామాంజనేయులు, వరికూటి సుబ్బరాయుడు, మజ్జారి లక్ష్మినారాయణ, మజ్జారి శ్రీను, మజ్జారి వెంకట రమణ, జగన్, మాజీ సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు,

మైదుకూరు, జనవరి 05, ప్రభాతవార్త:

భారత ప్రభుత్వం,క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ కేంద్రం కడప శాఖ మరియు అమ్మ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ పురస్కరించుకొని మైదుకూరు నియోజకవర్గ (మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, దువ్వూరు, బ్రహ్మంగారిమఠం మండలం) స్థాయిలో వాలీబాల్ పోటీలు 08 జనవరి 2025 తేదీ బుధవారం నాడు మేధా డిఫెన్స్ అకాడమీ క్రీడ మైదానం మైదుకూరు నందు జరుగునుచున్నాయని ఈ వాలీబాల్ పోటీలను పోటీల నందు 15 29 సంవత్సరాల లోపు వారు అర్హులు పోటీల్లో గెలుపొందిన వారికి ట్రోఫీతో పాటు క్యాష్ ప్రైస్ ఇవ్వబడును అలాగే పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి భారత ప్రభుత్వం వారి సర్టిఫికెట్స్ ప్రధానం చేయబడునని నెహ్రూ కేంద్ర అధికారి మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు.పోటీలో పాల్గొనదలచిన వారు 8520001065 నంబర్ కు ఫోన్ చేసి వారి టీం పేరును నమోదు చేసుకోవాల్సిందిగా కోరడమైనది.

# పొంచి ఉన్న ప్రమాదాన్ని తప్పించారు

తంబళ్లపల్లె డిసెంబర్ 5 ప్రభాతవార్త ః

మండల కేంద్రం పాత బస్టాండ్ వద్ద ప్రతి శనివారం ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు మినీ సంత జరుగుతుంది. రాగి మాను రచ్చ నుండి మసీదు మలుపు వరకు ఇరువైపులా కూరగాయల అంగళ్లు పెట్టడంతో కొనుగోలుదారులకు తీవ్ర ఇబ్బందులతో పాటు వాహనాలు వస్తే ప్రమాదం సంభవించే స్థాయిలో ఉండేది. ఈ విషయమై వార్త దినపత్రికలో ప్రమాదం పొంచి ఉంది స్పందించండి అనే శీర్షికతో వార్త ప్రచురితమైనది. ఈ వార్తపై స్పందించిన ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి, ఈఓ ఆర్ డి దిలీప్ కుమార్ నాయక్ లు తీవ్రంగా స్పందించారు. వెంటనే శనివారం నిర్వహించే మినీ వారపు సంతను మసీదు మలుపు నుండి పాత వాటర్ ట్యాంక్ వరకు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత కార్యదర్శి రామకృష్ణను ఆదేశించారు. ఆయన వెంటనే శనివారం వారపు సంతను స్థల మార్పు చేయడంతో వారపు సంతలో కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకపోగా ఆర్టీసీ బస్సులతో పాటు వాహనాలకు లైన్ క్లియర్ అయింది. యుద్ధ ప్రాతిపదికన సమస్యపై స్పందించిన అధికారులను స్థానిక వ్యాపారస్తులు, కొనుగోలుదారులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# టిడిపి కార్యకర్తకు అండగా..

చిన్నమండెం జనవరి 5 ప్రభాతవార్త :



మండలంలోని పడమటికోన గ్రామం హరిజనవాడకు చెందిన టిడిపి కార్యకర్త మంచిటి బసవయ్య సతీమణి నాగమణి ఆదివారం తన ఇంట్లో ప్రమాదవశాత్తు కింద పడడంతో కాలు విరిగింది. ఈ విషయాన్ని టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి తన అనుచరుల ద్వారా ఆమెను రాయచోటిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ తరలించి సొంత ఖర్చులతో వైద్య సేవలు అందించి అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. దీంతో లక్ష్మీప్రసాద్‌రెడ్డికి టిడిపి కార్యకర్త బసవయ్య, అతని కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వెల్లాల దేవస్థానంలో తలనీలాలు వేలం

రాజుపాళెం, జనవరి05, ప్రభాతవార్త.

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీసంజీవరాయస్వామి, శ్రీచెన్నకేశవస్వామి, శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు సమర్పించు తలనీలాలు, పోగుచేసిన తలనీలాలు, టెంకాయల అమ్మకం,కొబ్బరిచిప్పల సేకరణ సంబంధించి 8వతేది ఉదయం 10గంటలకు దేస్థానంలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఇఓ కెవి రమణ తెలిపారు.పాటలో పాల్గొను వారు దేవాదాయశాఖ వారు షరతులకులోబడి పాల్గొనవలసిందిగా తెలిపారు. వేలంపాట దక్కించుకొన్నవారు ఒక సంవత్సరం హక్కును కల్గి ఉంటారని తెలిపారు.

# భార్యభర్తపై దాడి ఘటనలో కేసు నమోదు

సుండుపల్లె, జనవరి05,ప్రభాతవార్త:

మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామం బురుజుకాడ రెడ్డేరుపల్లికు చెందిన మర్రిపాటి నాగరాణి అతని భర్త శివారెడ్డిపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేశారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే బురుజుకాడ రెడ్డివారిపల్లెకు చెందిన మర్రిపాటి వంశీ కుమార్‌రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి కోళ్లను మర్రిపాటి నాగరాణి, ఆమె భర్త శివారెడ్డి మందు పెట్టి చంపారనే ఉద్దేశంతో దాడి చేసి గాయపరచినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగరాణి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు పేర్కొన్నారు.

# యువకుడు ఆత్మహత్య

మదనపల్లెక్రైం, జనవరి 5 ప్రభాతవార్త :



పెళ్లికాలేదన్న బాధతో ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుటుంబసభ్యుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మొలకలచెరువు మండలం దేవలచెరువు పంచాయితీ మామిళ్లవారిపల్లికి చెందిన వసంత్‌కుమార్ కుమారుడు కె.వినోద్‌కుమార్ (27) భవనకార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఇతనికి 27 ఏళ్ల అయినా వివాహం కాలేదన్న బెంగతో నెలరోజులుగా ఎవరితో మాట్లాకుండా ఏకాంతం వుండేవాడు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వినోద్‌ను మదనపల్లె పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్సలు చేయిస్తుండగా,శనివారం అర్థరాత్రి మృతి చెందాడు. మొలకలచెరువు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహంకు శవపరీక్షలు పూర్తి చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

# కండెక్టర్ నిజాయితీ

## దొరికిన బంగారంను బాధితుడికి అప్పగింత

మదనపల్లెక్రైం, జనవరి 5 ప్రభాతవార్త :



ఆర్టీసి బస్సులో దొరికిన బంగారంను కండెక్టర్ నిజాయితీతో బాధితుడికి అప్పగించిన సంఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. రంగంపేటకు చెందిన శివకుమార్ స్వంతపనుల నిమిత్తం మదనపల్లెకు విచ్చేశాడు. అనంతరం తిరిగి మదనపల్లె డిపోకు చెందిన బస్సులో వెళ్లి రంగంపేటలో దిగాడు. అయితే తన వద్ద వున్న రూ.2.5లక్షల విలువచేసే 40 గ్రాముల బంగారు చైనును బస్సులో పోగట్టుకున్నట్లు తెలుసుకుని హుటాహుటిన తిరిగి మదనపల్లెకు వచ్చి రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటికే బస్సులో వున్న చైనును తన వద్ద వుంచుకున్న కండెక్టర్ గిరిజమ్మ విషయాన్ని అధికారులకు తెలపటంతో ఆమె వద్ద వున్న చైనును పోలీసుల సమక్షంలో బాధితుడిని అప్పగించారు. నిజాయితీగా బంగారు గొలుసును అందజేసిన గిరిజమ్మను పలువురు అభినందించారు.

# ఈడిగల సంక్షేమం కోసం పాటుపడింది తెలుగుదేశం పార్టీ మాత్రమే



ఒంటిమిట్ట జనవరి5 ప్రభాతవార్త:

తెలుగు దేశం పార్టీఆవిర్భావం నుండి ఈడిగల గౌడ కులస్తుల సంక్షేమ కోసం వారిఆభ్యున్నతి కోసం రాజకీయ ఔన్నత్యం కోసం పాటుపడింది తెలుగు దేశం పార్టీ మాత్రమే ననికల్లుగీతకార్మికులు సంక్షేమ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ మండల టిడిపి సీనియర్‌నాయకుడు కొమరా వెంకటసరసయ్య తెలిపారు. ఆదివారం కడపలో కడప జిల్లా ఈడిగ గౌడ సంక్షేమ సంఘం వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు కొమరా వెంకటసరసయ్య తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో దేవేందర్‌గౌడ్, కేఈ కృష్ణమూర్తి, ప్రస్తుత మంత్రి ఆనగాని సత్యప్రసాద్‌లను తెలుగుదేశం ప్రభుత్వంలో ఆత్యున్నత స్థానాలు కల్పించి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజకార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు,అనంతపురం జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, కడప జిల్లా గౌడ సంక్షేమ సంఘం ఆద్యక్షుడు రవిశంకర్‌గౌడ్, శారదమ్మ, సుమితాగౌడ్ ఎన్నారై శ్రీరాములుగౌడ్ పాల్గొన్నారు.

# 23న సాంఘిక శాస్త్ర ప్రతిభా పోటి పరీక్షలు

ప్రొద్దుటూరు జనవరి 5 ప్రభాతవార్త

నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా నేతాజీ సోషల్ స్టడీస్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రొద్దుటూరు గాంధీ రోడ్డు లోని పద్మశాలి కళ్యాణ మండపంలో సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్షను నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కడప ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా కరపత్రములు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నేతాజీ సోషల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి అవకాశం కలుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ భాస్కరరావు ఇలాంటి పరీక్షల వల్ల పిల్లల్లో పోటీ తత్వం పెరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గురు కుమార్ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం కార్యవర్గ సభ్యులు జమాల్ రెడ్డి, సుబ్బయ్య, వన్నప్ప, మైసూర్, కృష్ణ మోహన్ రావు, జమాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కప్పేసిన దట్టమైన పొగమంచు





రాజుపాళెం, జనవరి 05, ప్రభాతవార్త.
మండల వ్యాప్తంగా ఆదివారం తెల్లవారు జాము నుండి వ్యవసాయపనులు మొదలెట్టు పల్లెప్రజలకు కళ్ళముందు ఏముందో తెలియనంతగా దట్టమైన పొగమంచుతో కప్పేయటంతో వ్యవసాయపనులకు తీవ్ర అంతరాయం ఎర్పడటంతో పాటు,ప్రధాన రహదారులలో ఉదయం 5గంటల నుండి ప్రయాణం సాగించు వాహనదారులకు హెడ్‌లైట్లు వేసుకొని ముందుకు సాగాలన్నాచాలా అసౌర్యం కల్గించింది.ఇలా దట్టమైన పొగ మంచు రెండు రోజులుక్రితం రావటంతో పాటు ఆదివారం కూడా రావటంతో రైతులు సాగుచేసిన పంటలుకొన్ని పూతకాతదశలో ఉంటె మరికొన్ని చేతికొచ్చేదశలో ఉన్నాయని ఇటువంటి దశలలో పొగమంచు కమ్ముకుంటె పంటలు దెబ్బ తింటాయని ఆందోళన చెందుతున్నారు. తెల్లవారినప్పటి నుండి 8గంటలవరకు పొగమంచు దప్పటి కప్పేసినట్లు ఉండటంతో ఇళ్ళనుండి బయటకు రాలేక పోయారు తప్పని పరిస్థితుల్లో బయటివచ్చినా చలిమంటలు ఎక్కడి ఉంటె అక్కడ గుమిగూడారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు రావాల్సి సమయంలో వర్షాలు రాక,అవసరం లేనపుడు వర్షాలు అధికమై, చాలా రోజులు మబ్బులు ముసురుకొని మంచి దిగుబడి రావాల్సిన పంటలు దిగుబడులు లేక నష్టపోయారు రైతులు, రబీ పంటలైనా అయినా బాగుంటాయని ఎంతోఆశతో ఉన్న రైతుకు మొన్నటివరకు తుఫాన్‌లు, ఇప్పుడు పొగ మంచుతో రైతులకు ఆందోళన కల్గిస్తున్నవి.

## కన్నుల పండువగా శ్రీ గోదాదేవి, శ్రీ మహాలక్ష్మీదేవి సమేత శ్రీ ప్రసన్న రంగనాధస్వామి కళ్యాణం



శ్రీ గోదాదేవి, శ్రీ మహాలక్ష్మీదేవి సమేత శ్రీ ప్రసన్న రంగనాధస్వామి కళ్యాణం దృశ్యం



తరలివచ్చిన భక్తజనం

(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)
పట్టణం తోట కళ్యాణ మండపంలో ఆదివారం శ్రీ తిరుప్పావై భక్త సేవా సమితి ఆధ్వర్యంలో కన్నుల పండువగా శ్రీ గోదాదేవి, శ్రీ మహాలక్ష్మీదేవి సమేత శ్రీప్రసన్న రంగనాధస్వామి కళ్యాణోత్సవం జరిగింది. కల్యాణోత్సవంలో వేలాదిగా భక్తజనం తరలివచ్చి భక్తిశ్రద్ధలతో తిలకించారు. అంతకు ముందుగా ప్రత్యేకంగా వచ్చిన వేదపండితులతో షోడశోపచార పూజలతో శ్రీ గోమాత పూజను, శ్రీ తులసీ పూజను ఆధ్యాత్మికత ఉట్టిపడే రీతిలో నిర్వహించారు. తిరుప్పావై పాశురాలతోపాటు గోవిందనామాలు, విష్ణుసహస్ర నామాలు భక్తులు పారాయణం చేశారు. మన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆధ్యాత్మికతే పరమావధిగా శ్రీ తిరుప్పావై భక్త సేవా సమితి గత రెండేళ్లుగా ధనుర్మాసంలో శ్రీ గోదాదేవి, శ్రీ మహాలక్ష్మీదేవి సమేత శ్రీ ప్రసన్న రంగనాధస్వామి కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తూ ఈ ఏడాది ముచ్చటగా 3వసారి నిర్వహించింది. కళ్యాణోత్సవంలో కళ్యాణ అలంకరణలో శ్రీవారు, దేవేరులను ఎదురెదురుగా ఉంచి భక్తుల జయజయధ్వానాల మధ్య వేడుకగా ఎదుర్కోలు మహోత్సవాన్ని వేద పండితులు నృత్యాలు చేస్తూ వైభవంగా జరిపారు. అనంతరం వేదికపైకి దేవేరులతో కలిపి శ్రీవారిని చేర్చి కంకణధారణ, జీలకర బెల్లం, మాంగల్యధారణ తదితర కళ్యాణ తంతులతో ఘనంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. కళ్యాణోత్సవంలో ఆర్యవైశ్య సంఘానికి చెందిన మహిళలు, శ్రీ సరస్వతీ విద్యామందిరానికి చెందిన విద్యార్థులు ఆధ్యాత్మిక కోణంలో ప్రదర్శించిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాదంతో పాటు ముత్యాల తలంబ్రాలు, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ తిరుప్పావై భక్త సేవా సమితి నిర్వాహకులు జి.సరిత, ఎన్.వెంకయ్యనాయుడు, తోట నగేష్, సింధూరి చంద్రశేఖర్, గంగనపల్లి వెంకటరమణ, ఉజ్వల, చరిత, స్వప్న, మానస, మంజు, ప్రమీల, కోరముట్ల సాయిహరి, ఎల్లమ్మ, రేఖ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు, తెలుగు గిన్నీస్ రికార్డు గ్రహీత వెంకటేశ్వర్లు కోటపాటి గురుదాస్ పాడిన అన్నమాచార్య సంకీర్తనలు కళ్యాణోత్సవ వేడుకను ఆధ్యాత్మిక వాతావరణంలో నింపాయి.

## శ్రీమంతులు వైద్య సేవలు అందించేందుకు గ్రామాల బాట పట్టాలి

### భూపతి రాజును ఆదర్శంగా తీసుకోవాలి... శరత్‌కుమార్ రాజు, జగన్‌రాజు

రాజంపేట అర్బన్, జనవరి 05, ప్రభాతవార్త:
గ్లోబలైజేషన్‌తో గ్రామీణ ప్రాంతాల్లో కూడ ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వారికి ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు శ్రీమంతులు గ్రామాల బాట పట్టాలని, జన్మభూమికి సేవలు అందించాలని 'అడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా సంస్థ' లైజెనింగ్ ప్రతినిధి కే.శరత్‌కుమార్ రాజు, టీడీపీ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుల జగన్‌మోహన్ రాజులు అన్నారు. ఆదివారం బోయనపల్లిలోని శాన్వి ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా సంస్థ దత్తత తీసుకున్న తాళ్లపాక మదనగోపాళాపురం, చెర్లోపల్లె, ఒంటిమిట్ట, రాచపల్లె గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో శరత్ మాట్లాడుతూ 35గ్రామాలు దత్తత తీసుకొని ఉచితంగా ఆ గ్రామాల్లో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ భూపతి రాజు నిజంగా శ్రీమంతుడే అని అన్నారు. దత్తత తీసుకున్న గ్రామాల్లో ఎవరికి అనారోగ్య సమస్య వచ్చిన ఎక్కడ వైద్యం చేయించుకున్న సంస్థనే భరించడమే కాకుండా ఇలాంటి వైద్య సేవలు అందించడం హర్శనీయం అన్నారు. భూపతిరాజును శ్రీమంతులు ఆదర్శంగా తీసుకొని పుట్టిన గడ్డకు సేవలు అందించాలని పిలుపునిచ్చారు. జగన్‌మోహన్ రాజు మాట్లాడుతూ కార్పొరేట్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఎంతో బిజీగా ఉన్న ఆదివారం గ్రామాలకు వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందించడం పట్ల వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. రాజంపేట నియోజకవర్గ ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ సంధభ్బంగా డాక్టర్ భూపతి రాజు చేస్తున్న సేవలను కొనిఆడారు. వైద్య శిబిరం అంటే శాన్వి హైస్కూల్‌లోని చేస్తున్నారని శరత్‌కుమార్ రాజుని కొనిఆడారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా క్యాంప్ చైర్మెన్ డాక్టర్ రవిరాజు, డాక్టర్ ఎస్.బాలరాజు, వై.శివరామరాజు, కోనేటి రవిరాజు, డాక్టర్ ఎం.మారుతీ కృష్ణ, డాక్టర్ పి.చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ పి.నరసింహా, డాక్టర్ శ్రీరామరాజు, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ శ్రీహరి నాయుడు, డాక్టర్ సంజీవరెడ్డి, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ నిఖిల్, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ హరినాధ్,ఏ.అంజనరాజు పాల్గొన్నారు.



## జాబ్ మేళాలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల కీలకపాత్ర




వేంపల్లి, జనవరి 5, ప్రభాతవార్త :
పులివెందులలో నిర్వహించిన జాబ్ మేళా సజావుగా నిర్వహించడంలో ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిబుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కీలక పాత్ర పోషించినట్లు ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు.. ఆదివారం పులివెందులలో 2 వేల మందికి పైగా యువతి, యువకులు జాబ్ మేళాలో పాల్గొన్నారు. ఈ జాబ్ మేళా ఉద్యోగ అన్వేషకులకు మంచి ప్లాట్ ఫారం లు అయిన టెక్ మహేంద్ర,, కియా, ఇంకా గొప్ప కంపెనీల యజమానులతో కనెక్ట్ కావడానికి విలువైన వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రిజిస్ట్రేషన్ మరియు క్రౌడ్ మేనేజ్మెంట్‌తో సహా వివిధ పనులలో పాల్గొని జాబ్ మేళాను విజయవంతం చేశారు. వారి అంకితభావం కృషి జాబ్ మేళా అఖండ విజయం సాధించడంలో ఎంతో కీలక పాత్ర పోషించారు. యువత నుండి వచ్చిన అఖండ స్పందన, ఆర్థిక వృద్ధి ని ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలకు ఎంతోఅవసరం అన్నారు. ఈ జాబ్ మేళా ను విజయవంతం చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ 9 విద్యార్థులకు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ కుమార్ రెడ్డిలు అభినందించారు. జాబ్ మేళాలో స్పీచ్ ఇచ్చిన హరిశంకర్ అనే విద్యార్థిని పలువురు ప్రశంసించారు.

## సబ్ జూనియర్, జూనియర్ జిల్లా హాకీ జట్ల ఎంపిక

### పాల్గొన్న 60 మంది క్రీడాకారులు



పులివెందుల, జనవరి 5, ప్రభాతవార్త :
వైఎస్ఆర్ కడప జిల్లా సబ్ జూనియర్ , జూనియర్ హాకీ జట్టు లను ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు అరవై మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం పులివెందుల లోని వైయస్సార్ ఇంటిగ్రేట్ హాకీ స్టేడియంలో నిర్వహించిన సెలక్షన్స్ లో జిల్లా నలుమూలల నుంచి అత్యధికంగా పాల్గొన్న క్రీడాకారులలో మంచి ప్రతిభ కనబరచిన క్రీడా కారులను హాకీ కడప జిల్లా జట్టుకి ఎంపిక చేశారు. ఈ సెలక్షన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన రిటైర్డ్ పీఈటీ కృష్ణమూర్తి , హాకీ సెక్రెటరీ శేఖర్ లు పర్యవేక్షించారు. సెలక్షన్‌కు వచ్చిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. చక్కగా ఆడిన క్రీడాకారులను కోచ్ లు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఖాన్ భాషా, అనిల్ కుమార్,డేవిడ్ కుమార్ ఉదయ్ దీపు, శౌరి కుమార్ దినకర్, రవికుమార్, సీనియర్ క్రీడా కారులు పాల్గొన్నారు

## రోడ్డును పరిశీలించిన ఈఈ

దువ్వూరు, జనవరి 05, ప్రభాతవార్త:
మండల పరిధిలోని గుడిపాడు నుండి గొల్లపల్లె వరకు రూ.50లక్షలతో నిర్మించే రోడ్డును పంచాయతీ రాజ్ శాఖ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఈ మధుసూధన్ రెడ్డిలు ఆదివారం పరిశీలించారు. ఈ రోడ్డు గొల్లపల్లె నుండి గుడిపాడుకు వచ్చే దారిలో పొలాలు ఉన్నందున పొలాల మధ్యలో రోడ్డు నిర్మాణం ఎలా చేపట్టాలి అలాగే కాలువల వద్ద పనులు ఏ విధంగా చేయాలని కింది స్థాయి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ రోడ్డు నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సుబ్రమణ్యం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుధారాణి, మండల టీడీపీ కన్వీనర్ బోరెడ్డి వెంకట రమణారెడ్డిలు పాల్గొన్నారు.



## వ్యవసాయం లఘు చిత్రం పాటను ప్రారంభించిన మద్దూరి

పులివెందుల, జనవరి 5, ప్రభాతవార్త :



వ్యవసాయం ఇండిపెండెంట్ అనే లఘు చిత్రంలోని పాటను ఆదివారం తెదేపా మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకట్రామిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో మద్దూరి వెంకట్రామిరెడ్డి చేత చిత్ర నిర్మాత, చిత్ర బృందం పాటను విడుదల చేయించారు. ఈ సందర్భంగా మద్దూరి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రొడ్యూసర్ సా రెడ్డి గంగాధర్ రెడ్డి, డైరెక్టర్ రఘు ఆధ్వర్యంలో చిత్రీకరించిన ఈ లఘు చిత్రం లోని పాట చాలా అద్భుతంగా ఉందన్నారు. అబ్బా టీవీ హరిప్రసాద్, యూ ట్యూబ్ హరి లాంటి పేరు వున్న నటులు నటించడం మన రాయలసీమ వారు కావడం సంతోషం అన్నారు. ఈ లఘు చిత్రంలో నటించడం స్వతంత్ర లఘు చిత్రాలు యూట్యూబ్లో మనిషికి ఆనందాన్ని వినోదాన్ని ఒక మంచి సందేశాన్ని సమాజానికి అందిస్తున్నాయి అన్నారు. ఖాళీగా ఉన్న సమయాలలో మనసు ప్రశాంతత కోసం ఈ లఘు చిత్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. అనంతరం వ్యవసాయం లఘు చిత్ర పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ప్రొడ్యూసర్ సా రెడ్డి గంగాధర్ రెడ్డి ని దృశ్యాలతో పూలహారంతో సత్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ సారెడ్డి గంగాధర్ రెడ్డి, మా ఊరి సినిమా ప్రొడ్యూసర్ మంజునాథ్ రెడ్డి, అన్నా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, అమర్ యాదవ్, నటులు రైతుబిడ్డ హరి, మాచిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పటాన్, చిక్కని హరి, మురళి, రాఘవేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చురుకుగా కురవంక బ్రిడ్జి నిర్మాణ పనులు



మదనపల్లె, జనవరి 5 ప్రభాతవార్త :
రూరల్ మండలంలోని కురవంక బ్రిడ్జి నిర్మాణ పనులు సర్పంచ్ పసుపులేటి చలపతి పర్యవేక్షణలో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎన్నోఏళ్ళుగా కురవంక వాసులకు రెడ్డీస్‌కాలనీలోకి వచ్చేందుకు రోడ్డు మార్గంలేక ఎన్నో ఇబ్బందులు పడేవారు. సర్పంచ్ ఎన్నికల్లో కురవంక ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సర్పంచ్ చలపతి ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు రూ.10లక్షల వ్యయంతో బ్రిడ్జిపనులు జరుగుతున్నాయి. పనులు పూర్తి అయితే కురవంక వాసులకు పట్టణంలోకి వచ్చేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. బ్రిడ్జి పనులు చేపట్టడం వల్ల కురవంక గ్రామ ప్రజలు సర్పంచ్‌ను అభినందిస్తున్నారు. దీంతో పాటు గ్రామంలో మురుగునీటి కాలువల నిర్మాణం, సిసిరోడ్లు నిర్మాణ పనులు ప్రజా అవసరాల మేరకు సర్పంచ్ చేపట్టారు.

## ఉచితంగా యూనిఫామ్ పంపిణీ



మదనపల్లె, జనవరి 5 ప్రభాతవార్త :
పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఆదివారం పిల్లలకు ఉచితంగా యూనిఫామ్, బియ్యం వితరణ చేశారు. బి.కొత్తకోటకు చెందిన భారత్ ఇంగ్లీష్మమీడియం స్కూల్ యాజమాన్యం నూతన సంవత్సరం పురష్కరించుకొని కరస్పాండెంట్ జాఫ్నారా, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు వెలుగుస్కూల్‌కు విచ్చేసి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలుగు ప్రత్యేక పాఠశాలలో బుద్దిమాంద్య పిల్లలకు, వృద్ధులకు యాజమాన్యం చేస్తున్న సేవ పట్ల అభినందించారు. సేవాభావంతో చేస్తున్న సేవల పట్ల వారు అనందించారు. ఈసందర్భంగా వారికి వెలుగుసంస్థ యాజమాన్యం సన్మానించి మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగుస్కూల్ సెక్రటరీ ఎం.ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

## వెంకన్న భక్తులు తిరుమలకు పాదయాత్ర

రామసముద్రం, జనవరి 5 ప్రభాతవార్త :
మండలంలోని వెంకన్న భక్తులు తిరుమలకు ఆదివారం పాదయాత్రగా బయలుదేరి వెళ్ళారు. గోవింద మాలదారణ వేసిన వారు గోవిందనా నామస్మరణలతో తిరుమలరెడ్డిపల్లె, గుంతలపేట, నరసాపురం, శ్రీరాములుపల్లె, జంగాలపల్లె, కమతంపల్లె, తదితర గ్రామాల నుంచి భక్తులు పాదయాత్రగా బయలుదేరి వెళ్ళారు.

## రాజగోపుర నిర్మాణానికి భారీ విరాళం



పీలేరు, జనవరి 05 ప్రభాతవార్త ః
వాల్మీకి పురం మండలం గండబోయనపల్లి కోటలో వెలిసిన శ్రీ సత్యమ్మ తల్లి ఆలయ రాజగోపుర నిర్మాణానికి చిచ్చిలి కుటుంబ సభ్యులు 20.లక్షల రూపాయల భారీ విరాళం ఆలయ కమిటీ ౹చైర్మన్ పులి సత్యనారాయణ రెడ్డి సమక్షంలో ప్రకటించారు. కీర్తిశేషులు చిచ్చిలి కృష్ణారెడ్డి తనయుడు చిచ్చిలి హరికిరణ్, కీర్తి శేషులు చిచ్చిలి రాజారెడ్డి తనయుడు నిరంజన్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం శ్రీ సత్యమ్మ తల్లి ఆలయానికి విచ్చేసి అమ్మవారిని సందర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ గాలి గోపురం నిర్మాణానికి విరాళం ప్రకటించిన చిచ్చిలి కుటుంబానికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్ రెడ్డి, చక్రపాణి, ఓబుల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఇట్లంవారి పల్లి సత్యనారాయణ రెడ్డి, అమరనాథరెడ్డి, సర్పంచ్ గుర్రప్ప, రమేష్, జయకుమార్ రెడ్డి,పులి నారాయణ రెడ్డి, రెడ్డెప్ప, పూజారి ఉత్తన్న పాల్గొన్నారు.

## ధ్యానంతో ప్రశాంతత



వేంపల్లె, జనవరి 5, ప్రభాతవార్త :
ధ్యానం ద్వారా మనిషికి ప్రశాంతత లభిస్తుందని రాజ్య సభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ఆదివారం పులివెందులలో సరస్వతీ విద్యా మందిర్ లో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో అష్టా దశ అష్టోత్తర శత గృహ జ్ఞాన ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఆధునిక మానవుడు అన్నీ వుండి కూడా అశాంతితో అలమటిస్తున్నాడన్నారు. ఈ అశాంతిని పోగొట్టి భూ లోకాన్ని ఆధ్యాత్మిక స్వర్గ లోకంగా మార్చాలని,శాఖాహార ప్రపంచాన్ని సృష్టించాలని, అందుకు ధ్యాన యోగం సరైన మార్గమని భావించి 1990 లో బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ ఉద్యమాన్ని ప్రారంభించారని చెప్పారు. భగవంతుడు మానవుని శాఖాహారిగా పుట్టించాడని, కానీ చాలామంది మానవులు భగవంతుని ఆజ్ఞను ధిక్కరించి మాంసాహారులుగా మారిపోతున్నారని తులసి రెడ్డి వివరించారు. పిరమిడ్ సొసైటీ వారు తలపెట్టిన కార్యక్రమం జయప్రదం కావాలని తులసి రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో తిరుపతికి చెందిన బ్రహ్మర్షి కంచి రఘురాం మాట్లాడుతూ పిరమిడ్ సొసైటీ ద్వారా ప్రపంచం లోని అనేక దేశాలలో ధ్యాన యోగ కార్యక్రమాలు నడుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బాలి రెడ్డి, జయచంద్ర రెడ్డి, రమేష్ రెడ్డి, లలితకుమారి, పుల్లా రెడ్డి, శివమోహన్ రెడ్డి, నాగేంద్రమ్మ, అమర్నాథ్‌రెడ్డి, నాగరాజు, వినయ్, పెద్ద సంఖ్యలో ధ్యానులు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం బహిరంగ సభలో ఎమ్మెల్యే

జమ్మలమడుగు, జనవరి 5, ప్రభాతవార్త:
విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడ, కేసరిపల్లి, గన్నవరం విమానాశ్రయం సమీపంలోని ఎస్ఎల్‌వీ లైలా గ్రీన్ మెడోస్ వద్ద ఏర్పాటు చేసిన హైందవ శంఖారావం బహిరంగ సభప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎంఎల్ఏ సి.ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.



## మండిపల్లి వీరాభిమాని రాజు మంత్రికి బహుమతిగా రాజసింహాసనం



రాయచోటి, జనవరి 5 ప్రభాతవార్త
మండిపల్లి వీరాభిమాని, టిడిపి మైనార్టీ నాయకులు గఫార్, తనయుడు రాజు ఆదివారం రాయచోటి పట్టణం, థాన సర్కిల్ నందు గఫారియా ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి బహుమతిగా రాజసింహాసనం (కుర్చీ) ని బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి మైనార్టీ నాయకులు గఫార్ తనయుడు రాజు తన మీద ఉన్న అభిమానం ప్రేమ ఎన్నటికీ మరువలేనని కుర్చీ పైన నా ఫోటో వేయించి బహుమతిగా ఇవ్వడం ఎంతో గర్వంగా ఉందన్నారు. రాజు చూపిన ప్రేమ, అభిమానం ఎన్నటికీ మరువలేనన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పొగ మంచుతో పంటలకు తీవ్ర నష్టం



గుర్రంకొండ, జనవరి 5, ప్రభాతవార్త
గత నాలుగు రోజులుగా 6 గంటల నుండీ 7 గంటల ప్రాంతంలో పొగ మంచు కురుస్తుండడంతో పంటలకు తీవ్ర నష్టం కలుగుతోంది. టమోటాతోటలు, అనప, మామిడిలో పూత నల్లగా మారడం వంటి ప్రతికూల పరిస్థితులతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగ మంచు కురుస్తుండడంతో రసాయనిక మందులు పిచికారీ చేసినా ఏ మాత్రం రోగ నియంత్రణ కాకపోవడంతో రైతులు నష్టాల బాట పడుతున్నారు. ఒక్కో రోజు ఉదయం 5గంటల నుండీనే మంచు కురుస్తుండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు సైతం కనబడక ప్రమాదాలు కూడా జరిగే పరిస్థితి నెలకొంది. 8గంటల వరకు మంచు అధికంగా కురుస్తోంది.

## రెడ్డెమ్మకొండ ఆలయంలో భక్తుల సందడి

గుర్రంకొండ, జనవరి 5, ప్రభాతవార్త



రెడ్డెమ్మకొండ ఆలయంలో ప్రతి ఆది, గురువారాలలో భక్తుల సందడి ఎక్కువగా వుంటుంది. ఈ ఆలయానికి మన రాష్ట్రం నుండీనే కాక కర్నటక, తమిళనాడు నుండీ భక్తులు తరలిరావడం జరుగుతుంది. ఉదయం నుండీ సంతానంకోసం వచ్చిన మహిళలు పుష్కరిణిలో స్నానమాచరించి గర్భగుడి ముందు పొర్లు దండాలతో రెడ్డెమ్మతల్లికి మొక్కుకోవడం, సంతానం కలిగిన మహిళలు హుండీలో నగదు, బంగారు నగలు, వెండిలను కానుకలుగా అందజేయడం జరుగుతుంది. మరికొంతమంది భక్తులు గోధానం కూడా ఇవ్వడం జరుగుతుంది. ఈ రెడ్డెమ్మకొండకు ముస్లిం సోదరులు కూడా వచ్చి మొక్కులు చెల్లించుకొంటుంటారు. రెడ్డెమ్మపేరు వచ్చేలా రెడ్డిభాషా, రెడ్డిమాబూ, రెడ్డిపీరా మొదలగు అక్షరములతో పేరు వచ్చేలా ఈ ఆలయంలో వరంతో పుట్టిన వారికి ఇలా పేర్లు పెట్టుకొంటుంటారు. హిందువులు, ముస్లింల ఐక్యత చాటిచెప్పేలా భక్తులు మెలుగుతుంటారు. ఎన్నో ఆసుపత్రులు తిరిగి సంతానం కలగకపోయిన మహిళలు చెర్లోపల్లెలోని రెడ్డెమ్మతల్లి వారసుల దగ్గర నీళ్ళు త్రాగి వెళుతుంటారు. రెడ్డెమ్మకొండ ఆలయాన్ని ఇంకా అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

## తగ్గిన టమోటా ధరలు : కిలో రూ.10

### ఆందోళనలో రైతులు



మదనపల్లె, జనవరి 5 ప్రభాతవార్త :
టమోటా ధరలు గత వారం రోజులుగా తగ్గుముఖం పట్టడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆదివారం మదనపల్లె టమోటా మార్కెట్ యార్డులో పదికేజీల టమోటా బాక్స్ రెండవ రకం రూ.80ల నుంచి 100ల వరకు ధర పలికింది. మొదటి రకం రూ.110నుంచి 130ల వరకు ధరలు పలికాయి. 117మెట్రిక్ టన్నులు మాత్రమే టమోటాలు మార్కెట్‌కు వచ్చాయి. దిగుబడి తక్కువుగా ఉన్నా ధరలు లేకపోవడంతో సాగు చేసిన టమోటా రైతులు తీవ్రంగా నష్టాలు చవిచూస్తున్నారు. ఇన్నాళ్ళు ధరలు ఉండి ఇప్పడు ధరలు లేకపోవడంతో టమోటా సాగుపై రైతులు విరక్తి చెందుతున్నారు. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ లేకపోవడం వల్లే ధరలు తగ్గాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. సంక్రాంతి పండుగ సీజన్‌లో అయినా ధరలు వస్తాయా అంటూ రైతులు ఎదురుచూస్తున్నారు. టమోటా వ్యాపార లావాదేవీలకు మదనపల్లె మార్కెట్‌యార్డు రాష్ట్రంలోనే పేరుపొందింది. ఇక్కడ నుంచి టమోటాలు తమిళనాడు, కర్నాటక, ఒడిస్సా, కేరళ, తెలంగాణ, మద్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలతో పాటు వివిధ నగరాలకు టమోటాలు ఎగుమతి అవుతాయి.

## విశ్వం స్కూల్ సిబిఎస్ఈలో వైద్యశిబిరం

కురబలకోట, జనవరి 5 ప్రభాతవార్త :
ప్రతి బిడ్డ ఎదుగుదలలో ఆరోగ్య పరీక్ష అంతర్భాగం నిర్వహించబడిన వైద్య శిబిరం 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఆరోగ్య అవగాహనం పెంపొందిచడం, ప్రాథమిక వైద్యసాయం అందించడం, వారి సాధారణ అభివృద్ధిని అంచనా వేయడం లక్ష్యంగా పెట్టుకొంది. వ్యాధిని ముందుగా గుర్తించడం సకాలంలో చికిత్స చేసినపుడు పిల్లవాడు సాధారణ జీవితాన్ని గడపడానికి సహాయ పడుతుంది. తమ పిల్లల ఆరోగ్య అభివృద్ధిని ట్రాక్ చేయాలనే ప్రతి తల్లిదండ్రుల కోరికను ఈ కార్యక్రమం నెరవేరుస్తుంది. దంతవైద్యుడు డాక్టర్ దినకర్‌రెడ్డి దత తనిఖీ ఏదైనా దంత సమస్యలను గుర్తించడానిక దంత పరీక్షలు నిర్వహించబడింది. అదే విధంగా అంతర్లీన ఆరోగ్య సమస్యలను గుర్తించడానికి సాధారణ ఆరోగ్య పరీక్షన నిర్వహించబడింది. డాక్టర్ సునీల్‌కుమార్, నేత్ర వైద్యుడు, దృష్టిలోపాలు వంటి సమస్యలను గుర్తించడానికి కంటి పరీక్షలు నిర్వహించారు. నీ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.రోజ్లిన్‌ప్రియా, సిబ్బందికి విశ్వం గ్రూప్ ఛైర్మెన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.

